ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



మానవాళికి

TGTEL/25/A1132

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | శుక్రవారం | 21.08.2026 | సంపుటి : 2 | సంచిక : 49 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు




03

శ్రీనివాసరెడ్డి అక్రమాస్తులు

## వందకోట్లు

అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు



04

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

వీర్‌భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం



### పరస్పర సంప్రదింపులతోనే

# జల వివాదాల పరిష్కారం

ఏళ్ల తరబడి కొనసాగిస్తే ఎవరికీ ప్రయోజనం ఉండదు

న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు ఈ సమస్యలను పరిష్కరించలేవు

సెప్టెంబర్‌లో 4 రాష్ట్రాల సీఎంలతో ఢిల్లీలో భేటీ నిర్వహిస్తాం

సదరన్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

చెన్నై, ఆగస్ట్ 20 : దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి దేశ ప్రగతికి మూలాధారమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. జలవివాదాలను న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు పరిష్కరించలేవని.. పరస్పర సంప్రదింపుల తోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకోవడం తప్పు కాదని.. అయితే ఆ నెపంతో నీటిని సముద్రంలోకి వదిలేస్తూ ఏళ్ల తరబడి వివాదాలు కొనసాగిస్తే ఏ ఒక్కరికీ ప్రయోజనం ఉండదన్నారు. అందుకే తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక మధ్య నెలకొన్న జల వివాదాలపై చర్చించడానికి సెప్టెంబర్ తొలి వారంలో ఢిల్లీలో ఆయా రాష్ట్రాల సీఎంలతో సమావేశం నిర్వహిస్తామని అమిత్ షా ప్రకటించారు. తమిళనాడులోని మహాబలిపురంలో గురువారం జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ భేటీలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తమిళనాడు సీఎం సి.జోసెఫ్ విజయ్, ఏపీ సీఎం చంద్రబాబు, కర్ణాటక సీఎం డి.కె.శివకుమార్, కేరళ వి.డి.సతీశన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 2013లో కృష్ణా జలాల పంపిణీపై తీర్పును ప్రకటించగా,

-మిగతా 2 లో..

సమస్యల పరిష్కారమే

## అసలైన సమాఖ్యవాదం

దక్షిణాది అభివృద్ధి చెందితేనే.. దేశాభివృద్ధి పరుగులు

కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు చేయూత అందించాలి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

02

# రాజ్యాంగాన్ని వక్రీకరించారు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అఫిడవిట్‌ను స్వీకరించలేం

ఉద్యోగులు, భూములిచ్చిన రైతులను పట్టించుకోరా?

చెల్లింపులకు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రాధాన్యత ఏమిటి?

జీతాలు అందని తాత్కాలిక ఉద్యోగుల అవస్థలు పట్టవా?

కోర్టు సిబ్బందికి కొన్ని నెలలుగా జీతాలు అందడం లేదు

బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం



హైదరాబాద్, ఆగస్ట్ 20 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి దాఖలు చేసిన కౌంటరు అఫిడవిట్‌లో రాజ్యాంగాన్ని వక్రీకరించిన బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తరపున అఫిడవిట్ దాఖలు చేస్తూ అధికరణ 162 గురించి చెబుతున్నామంటూ పొంతనలేనిదాన్ని ఎలా పేర్కొంటారని నిలదీసింది. ఈ అఫిడవిట్‌ను స్వీకరించలేమని తప్పును సరిదిద్ది దాఖలు చేయాలని ఆదేశించింది. ఆర్థిక చెల్లింపుల్లో కోర్టులు సాధారణంగా జోక్యం చేసుకోవని, అయితే విధుల నిర్వహణలో సంక్షేమ పథకాల ప్రాధాన్యాన్ని గుర్తించాలంది. పరిహారం అందలేదని భూమిని కోల్పోయిన రైతులు, పింఛను ప్రయోజనాలు రాలేదని విశ్రాంత ఉద్యోగులు, వేతనాలందలేదని కాంట్రాక్టు సిబ్బంది కోర్టులను ఆశ్రయిస్తున్నారని.. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని హెచ్చరించింది. ఇదేమీ రాజకీయ చర్చకాదని.. 2014 నుంచి

-మిగతా 2 లో..





### సుస్మిత వ్యాఖ్యలపై

# సీఎం సీరియస్

చర్యలకు అవకాశం

ఉపముఖ్యమంత్రి, మంత్రులతో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి?

సుస్మిత ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయం

**హైదరాబాద్. ఆగస్ట్ 20 :** మంత్రి కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె సుస్మిత చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయి-ంలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడ్రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో

-మిగతా 2 లో..

### టికెట్లు ఇవ్వడంలో అధిష్ఠానానిదే

# తుది నిర్ణయం

ఎవరికి వారు ఎన్నికల్లో పోటీ చేస్తామంటే ఎలా?

సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తాం

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



నిజామాబాద్, ఆగస్ట్ 20 : "వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయం అని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆమె మాటలపై వివరణ ఇవ్వాలని మంత్రి కొండా సురేఖకు ఇప్పటికే పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు ఇచ్చింది. మంత్రి వివరణను పరిశీలించాక ఏం చేయాలో ఆలోచిస్తాం" అని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. నిజామాబాద్‌లో గురువారం నిర్వహించిన రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... "పార్టీకి ఎవరు వ్యతిరేకంగా మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. ఎవరికి వారు పలానా స్థానం నుంచి పోటీ చేస్తామని ప్రకటించడం సరికాదు. టికెట్లు

-మిగతా 2 లో..

### సుష్మిత వ్యాఖ్యలు

# ఆమె వ్యక్తిగతం

అందుకు తనను బాధ్యులు చేయడం తగదు

క్రమశిక్షణ లేఖను ఉపసంహరించుకోవాలన్న కొండా సురేఖ

హైదరాబాద్, ఆగస్ట్ 20 : తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గురువారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఆమె లేఖ రాశారు. ఈ సందర్భంగా తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ఆ లేఖలో మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తన కుమార్తె అయినంత మాత్రాన.. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని స్పష్టం చేశారు. సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని విశ్వాసం వ్యక్తం

-మిగతా 2 లో..





## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

### తెలంగాణలో దోపిడీ

# పాలన సాగుతోంది

నిషేధిత జాబితాకు పొంగులేటిదే బాధ్యత

పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్

న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 : రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో

-మిగతా 2 లో..



### 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు

# పరిష్కారం

కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమే లక్ష్యం

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు

అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

హైదరాబాద్, ఆగస్ట్ 20 : 22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ

-మిగతా 2 లో..



### ఖేలో ఇండియాలో

# పాల్గొనండి

కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం

కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయాను మంత్రి వాకిటి ఆహ్వానం

న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 : తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారి శ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్

-మిగతా 2 లో..



## రాష్ట్రాల పరస్పర సంప్రదింపులతోనే
# జల వివాదాల పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

ఇంకా ఆ తీర్పును నోటిఫై చేయలేదని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. 10 నిమిషాల్లో జరగాల్సిన పని 13 ఏళ్లు గడిచినా పరిష్కారం కాలేదని, ట్రిబ్యునల్ తీర్పును నోటిఫై చేయకపోయినా..ఆ తీర్పులో జరిపిన కేటాయింపుల ఆధారంగా కృష్ణా జలాలను వాడుకోవడానికి అనుమతించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నీటి కేటాయింపులు లేకుండా తెలంగాణ నిర్మిస్తున్న పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకోవాలని ఆయన కోరగా చర్చలతో ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని అమిత్‌షా సూచించారు. పోలవరం ప్రాజెక్టు నుంచే గోదావరి--కావేరి అనుసంధానం చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు వివాదాన్ని పరిష్కరించుకోవాలని కేంద్ర మంత్రి అమిత్ షా సూచించగా అన్ని ప్రాజెక్టులపై చర్చించి ఏకాభిప్రాయానికి వద్దామని చంద్రబాబు సూచించారు. పాలమూరు--రంగారెడ్డి, తుమ్మిడిహెట్టి, గోదావరి--కావేరి అనుసంధానం ప్రాజెక్టులతోపాటు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును నోటిఫై చేసే అంశంపై సెప్టెంబర్‌లో ఢిల్లీలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర సీఎంలతో సమావేశం నిర్వహిస్తామని ఈ సందర్భంగా అమిత్ షా ప్రకటించారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తులు, అప్పుల విభజన, ఇతర పెండింగ్ సమస్యలను కేంద్ర హోంశాఖ సంప్రదింపులతో త్వరలోనే పరిష్కరించుకోవడానికి రెండు రాష్ట్రాల ప్రతినిధులు సమ్మతించారు.

# రాజ్యాంగాన్ని వక్రీకరించారు

(మొదటిపేజీ తరువాయి)

అమలవుతున్న ఈ పథకంతో పాటు ప్రజల హక్కులకు సంబంధించినదని తేల్చి చెప్పింది. పథకాల అమలుకు అప్పులేమైనా చేశారా లేదా అనే వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశిస్తూ విచారణను 24కు వాయిదా వేసింది. ఈ కేసులో ప్రభుత్వం గత వారం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో ఈ రెండు పథకాల చెల్లింపులపై స్టే ఇచ్చిన జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం ఈ కేసుపై మరోసారి విచారణ చేపట్టింది. భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులు, రిటైరైన ఉద్యోగులు, ప్రస్తుత ఉద్యోగులు కూడా మనుషులేనని.. వారికి బకాయిలు చెల్లించకపోవడం ఏమిటని ధర్మాసనం నిలదీసింది. తాత్కాలిక ఉద్యోగులు కూడా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించరా అని ప్రశ్నించింది. కోర్టు సిబ్బందికి కూడా కొన్ని నెలలుగా జీతాలు అందని పరిస్థితి ఉందని చెప్పింది. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ భూసేకరణ పరిహారానికి సంబంధించి 19 ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా మూడింటిలో టోకెన్లు జారీ అయ్యాయన్నారు. త్వరలో మిగతా కేసుల్లోనూ విడుదల చేస్తామన్నారు. అయితే మిగిలిన కేసుల్లో చెల్లింపులు ఎందుకు జరగలేదో వివరాలు సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆర్టికల్ 162ను వక్రీకరించడాన్ని తప్పుబట్టారు. ఇది కేవలం సాధారణ తప్పిదం కాదన్నారు. ఏఏజీ స్పందిస్తూ ఆర్టికల్ 162ను తప్పుగా రాశారని అంగీకరించారు. ఇది తప్పిదమని.. సరిచేసే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రాన్ని పిటిషనర్ విజయ్‌గోపాల్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. 6 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, రెండో పీఆర్సీ అమలు కాలేదని అందులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఏజీ జోక్యం చేసుకొని ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధం లేదన్నారు. ప్రభుత్వం రూ. 5 కోట్ల బిల్లు చెల్లించకపోవడంతో ఒక ప్రభుత్వ కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటనను పిటిషనర్ ప్రస్తావించగా న్యాయమూర్తి జోక్యం చేసుకొని దీనికి ఈ కేసుతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయ వేదికగా కోర్టులను చేసుకోవద్దని.. పథకానికి, పార్టీలకు సంబంధం లేదన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల కొనసాగింపునకు రాష్ట్ర ప్రభుత్వం రుణాలేమైనా తీసుకుందా అనే అంశంపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. భూనిర్వాసితుల పరిహారం, రాష్ట్ర అప్పుల పరిస్థితి, సంక్షేమ పథకాలకు నిధుల సమీకరణ వంటి అంశాలను అందులో పేర్కొనాలన్నారు.

## 22ఏ సమస్యపై
# ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి గారు స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఀాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా? భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు, గడచిన రెండు మూడు రోజుల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 2ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి' అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

## సమస్యల పరిష్కారమే
# అసలైన సమాఖ్యవాదం

- దక్షిణాది అభివృద్ధి చెందితేనే.. దేశాభివృద్ధి పరుగులు
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు చేయూత అందించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మహాబలిపురం, ఆగస్టు 20 :** కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీషన్, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని ఆయన చెప్పుకొచ్చారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సీఎం చెప్పారు.సమస్యలు రాష్ట్ర సరిహద్దుల ను ప్రభుత్వ ÷ల్లె కంటే వేగంగా దాటుతాయి భట్టి చమత్కరించారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను తెలంగాణ కచ్చితంగా కోరుకుంటోందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ, ఆంధప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్? పరిధిలో ఉందని ఆయన గుర్తు చేశారు. చట్టపరమైన పక్రియ ద్వారా త్వరగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన చెప్పారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఈ సమస్యలకు తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడం కాదని, ప్రతి కొన్ని సంవత్సరాలకు కొత్త అర్థాలు, వివరణలు ఇవ్వడం కూడా కాదని ఆయన వ్యాఖ్యానించారు. పెండింగ్ అంశాలు ఇకపై తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలని తెలంగాణ కోరుకుంటోందని అన్నారు. షెడ్యూల్ లోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. ఆంధప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం?2014కు సంబంధించి సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపింది. సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరుకుంటున్నప్పటికీ, అది తప్పనిసరిగా చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే ఉండాలని స్పష్టంగా చెప్పారు. షెడ్యూల్?టీ సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజనను ఆంధప్రదేశ్ కోరుతోందని, అయితే పునర్వ్యవస్థీకరణ చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారం లేదని ఆయన చెప్పారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతు లేదని తెలిపారు. ఈ అంశం ఆంధప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన పక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని కోరారు. నీటి భద్రత, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, పట్టణీకరణ, రవాణా?లాజిస్టిక్స్, ఆర్థిక పోటీతత్వం వంటి అంశాలు రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లుగా మారనున్నాయని అన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు పోటీ పడుతూనే పరస్పరం సహకరించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దక్షిణ భారతదేశం కలిసి అభివృద్ధి చెందితే, భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తదుపరి 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమస్యలకు చర్చల ద్వారా శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని ఆకాంక్షించారు. ట్రిబ్యునల్ లేకుండా, కమిటీ లేకుండా, బహుశా మరోసారి ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా లేకుండా సమస్యలు పరిష్కారం కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరయ్యే అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆత్మీయ ఆతిథ్యం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

# సుస్మిత వ్యాఖ్యలపై సీఎం సీరియస్

(మొదటిపేజీ తరువాయి)



పర్యటించారు. సమ్మక్క-సారలమ్మను దర్శించుకోవడంతో పాటు ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రిపై తీవ్ర స్థాయిలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. బుధవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఎం గురువారం లండన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఢిల్లీలో ఉన్నప్పుడే కొందరు ముఖ్యనాయకులతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రితోనూ, మరి కొందరు మంత్రులతోనూ మాట్లాడినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ బుధవారం మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలినని గురువారం సమాచారం ఇచ్చారు. ఇదే సమయంలో మంత్రి మాజీ ఓఎస్‌డీ సుమంత్‌పై గురువారం కేసు నమోదైంది. ఓ వ్యాపారిని బెదిరించి దాడిచేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో ఈ కేసును పోలీసులు నమోదు చేశారు. గతంలో ఓ వివాదంలో ఇతనిని అరెస్టు చేయడానికి ప్రయత్నించినపుడు కూడా కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఆ సమయంలో పార్టీలోని కొందరి జోక్యంతో పరిస్థితి సద్దుమణిగినా, తాజా పరిణామాల్లో అలాంటి పరిస్థితి కనిపించడం లేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఇలాంటి వ్యవహారాల్లో ఆచితూచి అడుగేయాలనే అభిప్రాయం కూడా పార్టీలో కొందరు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. మెంత్రిమీద ఈ వ్యవహారం రానున్న రోజుల్లో మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

# సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

(మొదటిపేజీ తరువాయి)



చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని కమిటీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా క్రమశిక్షణా కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుస్మిత మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతానని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో సుస్మితా పటేల్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్.. ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని పీసీసీని కోరింది. అలాగే క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి కూడా స్పందించారు. దీనిపై మంత్రి కొండా సురేఖను వివరణ కోరతామని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు.



## టికెట్లు ఇవ్వడంలో అధిష్ఠానానిదే తుది నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వడంలో సీడబ్ల్యూసీ, అధిష్ఠానానిదే తుది నిర్ణయం. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ప్రభుత్వంపై ఎందుకు వ్యాఖ్యలు చేశారు? ఆయన ఆవేదన ఏమిటి? అనేది అర్థం చేసుకున్నాం. ఆ నియోజకవర్గంలోని కొత్త, పాత నేతలను సమన్వయం చేసుకుని ముందుకెళ్తాం. నిషేధిత భూములకు సంబంధించిన 22ఏ పై భారాస అనవసర రాద్ధాంతం చేస్తోంది. కిందిస్థాయిలో జరిగిన తప్పులను సరిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు" అని వివరించారు.



# తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

(మొదటిపేజీ తరువాయి)

చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 ం భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు. ధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాలని ఇటీవల హైకోర్టు వ్యాఖ్యలు చేసిందన్నారు. ఎవరి ఇళ్లు ఎప్పుడు నిషేధిత జాబితాలోకి వెళ్తుందో అని ప్రజలు భయపడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# ఖేలో ఇండియాలో పాల్గొనండి

(మొదటిపేజీ తరువాయి)

న్యూఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువ క్రీడాకారులకు జాతీయ స్థాయిలో మెరుగైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి తెలంగాణను దేశ క్రీడా పటంలో మరింత బలమైన రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ల్గ÷లో ఇండియా కార్యక్రమ నిర్వహణ కోసం తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను మంత్రి వాకిటి శ్రీహరి కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

# హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన
# సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

## హాజరైన ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు



**మహాబలిపురం, ఆగస్టు 20 :** హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం మహాబలిపురంలో జరిగింది. ఈ సమావేశంకు ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు హాజరయ్యారు. సమావేశంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి ( సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సీఎం సూచించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించడంతోపాటు దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదించిన చేసారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరిన ముఖ్యమంత్రి దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందన్నారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ప్రసంగంలో పేర్కొన్న సీఎం, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థలు 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదనీ వెల్లడించారు. కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదన చేసిన సీఎం, గోదావరి, కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వ్యాఖ్యానించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. గంగా, కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరం అన్న చంద్రబాబు, నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలన్నారు. సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని కొనియాడిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్ తో మాట్లాడారని పేర్కొన్నారు. విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారని ప్రశంసించారు కర్ణాటక సీఎం డీకే శివకుమార్.



## భూ భద్రత కోసమే భూ భారతి

- గతంలో బోగస్ పాస్ పుస్తకాలతో రైతుభరోసా స్వాహా
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**ఖమ్మం,ఆగస్ట్20 :** గత ప్రభుత్వ హయాంలో భూమి లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా భూ భారతి ద్వారా సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతుల భూములకు భద్రత కల్పించడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే భూ భారతి సర్వే ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని మొత్తం ఏడు గ్రామాల్లో భూ భారతి కార్యక్రమం కింద భూ సర్వే ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు. గతొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, ప్రతి ఆరు నెలలకు 70 గ్రామాల చొప్పున సర్వే కొనసాగించి ఏడాదిన్నర కాలంలో పక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. సర్వే పక్రియలో రెవెన్యూ అధికారులు నిరంతరం కష్టపడుతున్నారని.. పూర్తయిన భూ వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## ధాన్యం బకాయిల ఎగవేత

- రైలుమిల్లర్లపై చర్యలకు రంగం సిద్ధం
- ఈడీకి నివేదిక అందచేసిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, ఆగస్ట్ 20 :** తెలంగాణలో ప్రభుత్వ ధాన్యం బకాయిలను భారీగా ఎగవేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లర్లపై సివిల్ సప్లయ్ శాఖ చర్యలకు సిద్ధమవుతోంది. ప్రభుత్వానికి భారీ మొత్తంలో బకాయిపడిన 20 మంది రైస్ మిల్లర్ల జాబితాను సివిల్ సప్లయ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి అందజేసినట్లు సమాచారం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను మిల్లర్లు ఉద్దేశపూర్వకంగా నిలిపివేసినట్లు అధికారు లు అనుమానిస్తున్నారు. అంతేకాకుండా, ధాన్యం లావాదేవీల్లో అక్రమ మార్గాల్లో నిధులు సమీకరిం చడం.. హవాలా రూపంలో డబ్బులు సంపాదించడం వంటి ఆరోపణలు కూడా మిల్లర్లపై ఉన్నట్లు తెలు స్తోంది. దీంతో ఆయా మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలు, ధాన్యం కొనుగోళ్లు ?మిల్లింగ్‌కు సంబంధించిన రికార్డులపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఈడీకి ఫిర్యాదు చేసినట్లు సమా చారం. ప్రభుత్వ ధాన్యం బకాయిలను చెల్లించకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మిల్లర్లపై కఠిన చర్యలకు పోలీస్ శాఖ కూడా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం 9 మంది రైస్ మిల్లర్లపై పీడీ యాక్ట్ ప్రయో గించే దిశగా నిర్ణయం తీసుకున్నట్లు సమా చారం. ప్రభు త్వానికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో పలు మార్లు నోటీసులు ఇచ్చినా స్పందిం చకపోవడం, బకాయిలను భారీగా పెండింగ్‌లో ఉంచడం, ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు అనుమానాలు ఉండటం తో ఈ చర్యలకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## లద్దాఖ్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

### కేంద్రం నిర్ణయించిందన్న అమిత్ షా

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 :** కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిర్ణయించింది. జమ్ముకశ్మీర్ హైకోర్టు బెంచ్‌ను లద్దాఖ్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర కేబినెట్ నిర్ణయించిందని హోం మంత్రి అమిత్ షా గురువారం తెలిపారు. బెంచ్ ఏర్పాటుతో లద్దాఖ్ ప్రజలకు న్యాయం మరింత చేర-ువవుతుందని చెప్పారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిక ప్రాంతాలకు ఒకే హైకోర్టు ఉన్న విషయం తెలిసిందే. కేంద్రం 2019లో జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని విభజించి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పాటు చేసింద. ఇదిలా ఉంటే, కేంద్రం బుధవారం రూ.9,450 కోట్ల విలువైన నాలుగు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఖరగ్‌పూర్-భద్రక్ మధ్య, భద్రక్-హరిదాస్‌పూర్ మధ్య అదనపు రైల్వే లైన్ ఏర్పాటు చేయడంతో పాటు ఏపీ-తమిళనాడు, కటక్, పారాదీప్ మధ్య అదనపు లైన్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. 2030-31 కల్లా వీటి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## మంత్రి పొంగులేటి భారీ అవినీతి

### చర్చకు సవాల్ చేసిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 20 :** తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భారీ అవినీతికి తెరలేపారని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మంత్రి అవినీతికి సంబంధించి అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని, హౌస్ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతిపై చర్చకు సిద్ధమా? అంటూ మంత్రి శ్రీనివాస రెడ్డికి ఏలేటి మహేశ్వర్ రెడ్డి బుధవారం సవాల్ చేశారు. తన సవాల్‌ను స్వీకరిస్తే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని కోరారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేరుకున్నారు. ఈ సందర్భంగా తన సవాల్‌పై చర్చకు రావాలని మంత్రిని ఏలేటి మరోసారి డిమాండ్ చేశారు. తాను మధ్యాహ్నం 2 గంటల వరకు ఇక్కడే ఉంటానని, శ్రీనివాస రెడ్డి రావాలని డెడ్ లైన్ విధించారు.

## శ్రీనివాసరెడ్డి అక్రమాస్తులు వందకోట్లు

### అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు





**హైదరాబాద్, ఆగస్ట్ 20 :** అక్రమాస్తుల కేసులో ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డిని రంగారెడ్డి ఏసీబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరికాసేపట్లో శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని అన్నారు. ఈ సందర్భంగా అతడి ఆస్తులకు సంబంధించిన ప్రెస్‌నోట్‌ను ఏసీబీ అధికారులు విడుదల చేశారు. శ్రీనివాస్‌రెడ్డి నివాసం, కార్యాలయంతో పాటు మరో ఐదు ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు జరిపిందని వివరించారు. ఈ సోదాల్లో భారీగా ఆస్తులు, నగదు, బంగారం, బ్యాంక్ బ్యాలెన్స్ గుర్తించినట్లు తెలిపింది. కర్మన్‌ఘాట్ లో రెండు రెసిడెన్షియల్ ప్లాట్లు.. వీటి విలువ రూ.2.63 కోట్లు ఉంటుందని పేర్కొంది. అలాగే కర్మన్‌ఘాట్‌లో పెంట్‌హౌస్.. దీని విలువ రూ.1.61 కోట్లు ఉంటుందని చెప్పింది. యాచారం మండలం నల్లవెల్లి గ్రామంలో 10 ఎకరాల వ్యవసాయ భూమితోపాటు వివిధ ప్రాంతాల్లో 8 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించామని వివరించింది. నరేంద్ర బార్ అండ్ రెస్టారెంట్‌లో రూ.86 లక్షల పెట్టుబడి పెట్టినట్లు ఈ సోదాల్లో గుర్తించామని పేర్కొంది. ఈ సోదాల్లో రూ.4 లక్షల నగదు, బ్యాంక్‌లో రూ.8.60 లక్షల బ్యాలెన్స్ ఉందని స్పష్టం చేసింది. క 680 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. నాలుగు ఫోర్ వీలర్లు, మూడు టూ వీలర్లు.. మొత్తం 7 వాహనాలు ఉన్నాయని వెల్లడించింది. ఈ వాహనాల విలువ సుమారు రూ.59 లక్షలు ఉంటుందని పేర్కొంది. ఇంట్లో రూ.11 లక్షల విలువైన వస్తువులు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు ఉన్నాయని.. వాటిని సీజ్ చేశామంది. బ్యాంకులో 46 తులాల బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నట్లు గుర్తించారు. ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.6.87 కోట్లు ఉందని.. బహిరంగ మార్కెట్లో వీటి విలువ వందల కోట్ల రూపాయిలు ఉంటుందని అంచనాకు వచ్చినట్లు తెలిపింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో ఏసీబీ వివరించింది. గతంలోనూ.. 2009లో శ్రీనివాస్‌రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తులు కేసు నమోదు చేసినట్లు గుర్తు చేసింది. అప్పట్లో మహేశ్వరం మండలంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారని ఏసీబీ అధికారులు వివరించారు.

## కొత్త క్రిమనల్ చట్టాలపై సమన్వయంతో సాగాలి

### పోలీసులు, న్యాయవ్యవస్థకు చీఫ్ జస్టిస్ సూచన

**హైదరాబాద్, ఆగస్ట్ 20 :** కొత్త చట్టాల అమలుకు పోలీసులు, న్యాయవ్యవస్థ, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్, వైద్య, జైళ్ల శాఖల మధ్య బలమైన సమన్వయం అవసరమని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే బాధితులకు సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. జస్టిస్ మౌషుమి భట్టాచార్య కొత్త చట్టాల అమలులో డిజిటల్ లిటరసీ అత్యంత అవసరమని, డిజిటల్ ఎ÷-లాట్‌ఫామ్స్‌లో తప్పులు, డూప్లికేట్ డేటా ఎంట్రీ వల్ల కేసుల్లో జాప్యం జరుగుతోందని సూచించారు. కొత్త క్రిమినల్ చట్టాల డిజిటలైజ్డ్ అమలుపై తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ, తెలంగాణ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర సమన్వయ సదస్సు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది న్యాయ, పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్లు, ఫోరెన్సిక్, వైద్య శాఖల అధికారులు హైబ్రిడ్ విధానంలో సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. 'కొత్త క్రిమినల్ చట్టాలు కేవలం పాత చట్టాల స్థానంలో వచ్చినవి మాత్రమే కాదు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, డిజిటల్ ఎవిడెన్స్, ఎలక్ట్రానిక్ రికార్డులు, టైమ్ బౌండ్ ప్రొసీజర్స్‌కు ప్రాధాన్యం ఇస్తాయి' అని అన్నారు. డిజిటల్ ఎవిడెన్స్, డిజిటల్ కేస్ మేనేజ్‌మెంట్, నుంచి చార్జ్‌షీట్ వరకు ఆన్‌లైన్ పక్రియలపై సదస్సులో ప్రజెంటేషన్లు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు సాక్ష్యాలు, ఫోరెన్సిక్ మెడికల్ ఇంటర్‌ఫేస్‌లపై అవగాహన కల్పించారు. పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్ల శాఖల మధ్య సమాచార మార్పిడి మరింత వేగవంతం కావాలని డీజీపీ సూచించారు. కొత్త చట్టాల అమలుపై నెలవారీ సమీక్షా వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

## మహారాష్ట్రలో అధ్వాన్నంగా స్కూళ్లు

### అభిజీత్ దీప్కే డిమాండ్

**ముంబై, ఆగస్ట్ 20 :** మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని స్కూళ్లల్లో మౌలిక వసతుల సరిగా లేని వైనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వారం ప్రారంభించిన స్కూల్ రీక్ కరో కార్యక్రమంలో భాగంగా తాజాగా ఆయన లాతూర్ జిల్లాలోని ఉజనీ గ్రామంలోని జిల్లా పరిషత్ స్కూల్‌ను సందర్శించారు. స్కూళ్లల్లో సరైన తరగతి గదులు, బెంచీలు, టాయిలెట్లు, స్కూళ్లకు వెళ్లేందుకు భద్రమైన రోడ్లు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మౌలిక వసతులు లేకుండా పిల్లలు ఎలా చదువుకుంటా రని ప్రశ్నించారు. స్కూళ్ల పరిస్థితి సరిగా లేని తీరుపై ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాలని అన్నారు. విద్యాశాఖకు వారు తగిన ప్రాధాన్యం ఇచ్చేలా ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. కొన్ని స్కూళ్లల్లో పిల్లల పరిస్థితి జంతువుల కంటే దారుణంగా ఉందని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి మంచీ చేయలేని రాజకీయ నాయకులకు ప్రజలు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. వాళ్లు ప్రజాప్రతినిధులు అయ్యాక హెలికాప్టర్లలో తిరుగుతారని ఓటు వేయాలా అని ప్రశ్నించారు. తమ పిల్లలు ఎలాంటి పరిస్థితుల్లో చదువుకుంటున్నారో ప్రజలు పరిశీలించుకోవాలని అన్నారు. ప్రజాప్రతినిధుల ఇళ్లల్లోని పెంపుడు జంతువులకు ఇంతకంటే మంచి వసతులు ఉన్నాయని అన్నారు. విద్యాశాఖపై దృష్టిపెట్టాలని తమ గ్రామానికి వచ్చే ప్రతి నేతనూ కోరాలని ప్రజలకు సూచించారు.

## నేటి నుంచి జిల్లాల వారీగా
# రెవెన్యూ సమీక్షలు

- క్షేత్రస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం చూపే లక్ష్యం
- నేడు జగిత్యాలలో..రేపు నిజాబాద్‌లో సమీక్ష
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాచరణ

**హైదరాబాద్,ఆగస్ట్20 :** ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడం, భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల వారీగా సమీక్షలకు శ్రీకారం చుడుతున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సమీక్షలు కేవలం అధికారిక సమావేశాలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను నిర్దేశిరచే విధంగా కొనసాగనున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల సమీక్షలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించడంతో పాటు, దూర ప్రాంత జిల్లా లకు మంత్రి స్వయంగా వెళ్లి అక్కడే సమీక్షలు నిర్వహించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లతో సహా సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమీక్షల్లో పాల్గొంటారు. ఆయా ప్రాంతాలకు సంబంధించి న ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా సమీక్షల్లో భాగస్వాములను చేసి.. ప్రజల నుంచి వస్తున్న సమస్య లు, స్థానిక అవసరాలు, పరిష్కరిం చాల్సిన అంశాలను నేరుగా తెలుసుకు నే విధంగా మంత్రి ఈ సమీక్షలను నిర్వహిం చనున్నారు. రెవెన్యూ అంశాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, హౌసింగ్ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థలాల సమస్యలు తదితర అంశాలను కూడా జిల్లా సమీక్షల్లో మంత్రి పరిశీలించనున్నారు. జిల్లాల వారీగా చేపట్టనున్న సమీక్షల్లో భాగంగా శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు.





## కమీషన్‌ల కోసమే 22 ఏ జాబితా

- 30శాతం కమీషన్ల వసూళ్లపై జవాబివ్వాలి
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ విమర్శలు

**హైదరాబాద్,ఆగస్ట్20 :** కమిషన్‌ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం 22 ఏ తీసుకొచ్చిందని బిఆర్ఎస్ నేత, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజల ఇండ్లు, ప్రయివేట్ భూములను 22 ఏ లో చేర్చే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 22 ఏ ను అడ్డం పెట్టుకొని భూముల యజమానులను భయపెట్టి 30 నుండి శాతం కమిషన్లను వసూలు చేసిన మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం తప్పిదాలు చేసి అధికారులపై నెపం పెట్టి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తుందని విమర్శించారు. కరోనా సమయంలో సరిపడా ఆక్సిజన్, బెడ్ లు లేక ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ అవసరాల కోసం ముందు చూపుతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట ప్రాంతాలలో కార్పొరేట్ స్థాయి హాస్పిటల్స్ నిర్మాణ పనులు చేపట్టిందని వివరించారు. తమ ప్రభుత్వ హయాంలోనే 60 శాతం పనులు పూర్తయ్యాయి అనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. సనత్ నగర్ టిమ్స్‌ను కట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకోవడం అవివేకమని విమర్శించారు. హాస్పిటల్ లో అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించకుండా హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. హాస్పిటల్ ప్రారంభోత్సవ సభలో అధికారిక కార్యక్రమం అనే సోయి లేకుండా వైద్యులు, నర్సింగ్ విద్యార్థుల ముందు ముఖ్యమంత్రి నోటికొచ్చినట్లు పచ్చి అబద్దాలు మాట్లాడారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి రిబ్బన్ కటింగ్ లు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన భాషను మార్చుకోవాలని, నోటిని అదుపులో పెట్టుకోవాలని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. బాధ్యత గల పదవిలో ఉంటూ గౌరవం, సంస్కారం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు సంస్కారం అడ్డం వస్తుందని, లేదంటే మీకన్నా ఎక్కువ మాట్లాడగలమని చెప్పారు. ప్రజాపాలన అని ఒక వైపు ప్రచారం చేసుకుంటూ మరో వైపు నిర్బంధాలు, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



## డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి : తోటకూర

### కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి

**మేడ్చల్/నాగారం,ఆగస్టు 20 (జనం వార్త) :** నాగారం డివిజన్ అభివృద్ధికి రూ 25 కోట్ల రూపాయలను మంజూరు చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించి నిధులు విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమయ్య యాదవ్,డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్,మాజీ కౌన్సిలర్లు,పార్టీ సీనియర్ నాయకులు నల్లోల కుమార్,అన్నంరాజు సురేష్,జీవన్ రెడ్డి,పంగ సంతోష్,దొడ్డి నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

# ధరల పెరుగుదలను కంట్రోల్ చేసేదెవరు?



**దేశంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. ధరలతో సామాన్యులు అల్లాడి పోతున్నారు. అయినా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ధరల కట్టడికి కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఈ వ్యవహారం తమ పరిధిలో లేదన్నరీతిలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. సొంత ఎజెండాలను ముందుకేసుకుని నడుస్తున్నాయి. ప్రజలు ఏమయి-ఎతేనేమి అన్న భావనలో పాలకుల తీరు ఉంది. ఎన్నికలప్పుడు మేనేజ్ చేయడం నేర్చుకున్న వారు ఆ తరవాత ప్రజలను పట్టించుకోవడం లేదు. ఎదుటి పార్టీలను బురిడీ కొట్టించడం, నానాయాగీ చేయడం తప్ప పాలన కట్టుతప్పి పోతోంది. ప్రధానంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఫైన్ రైస్ కిలో బియ్యం ధర 80 రూపాయలకు చేరింది. ఈ ధరలు మరింత పెరుగుతాయని, వందకు చేరుకుంటుందని అంటున్నారు.**

ఎల్‌నినోతో ఉత్పత్తి తగ్గిందన్న సాకుతో ధరలు పెంచేశారు. అలాగే ఉప్పులు పప్పులు, నూనెల ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. మందుల ధరలు కూడా గుట్టుచప్పుడు కాకుండా పెంచేస్తున్నారు. ఇవన్నీ ఎవరి పరిధిలో ఉందో ప్రజలకు తెలియడం లేదు. ఇక కూరగాయల ధరలు కూడా 60 నుంచి వంద వరకు పలుకుతున్నాయి. అయితే ఎపిలో సబ్సిడీ బియ్యం పథకం ప్రారంభించారు. ఇది పెద్దగా ప్రజామోదం పొందలేదు. పాలకులు సొంత ఎజెండాతో, పార్టీ పరంగా విమర్శలు, ప్రతి విమర్శలతో బిజీగా ఉన్నారు. ఎపిలో అప్పుడే ఎన్నికలు వచ్చాయా అన్న రీతిలో వైకాపా, టిడిపి కూటమి పరస్పర విమర్శలు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ నడుస్తున్నా అందులో ధరలపై ఎజెండా లేదు. తెలంగాణలో 22ఎ వ్యవహారం ముదిరింది. ప్రజలను రోడ్డుకీడ్చిన రేవంత్ సర్కార్ వారి నుంచి భూములను లాక్కునే ప్రయత్నంలో ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. మంత్రులంతా వసూళ్లలో పడ్డారని, 30 శాతం కమిషన్ ప్రభుత్వం అని విపక్ష బిఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. బిఆర్ఎస్‌ను విమర్శించడంలో కాంగ్రెస్ బిజీగా ఉంది. ఇక బిజెపి వందేమాతరం, డీలిమిటేషన్, కొత్త కార్యవర్గం కూర్పుతో బిజీగా ఉంది. కాంగ్రెస్ పార్టీ బిజెపిని విమర్శించడం, యువతకు క్షమాపణలు చెప్పండి అన్న పనిలో పడింది. మొత్తంగా దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలన్నీ సొంద ఎజెండాతో నడుస్తున్నాయి. అందువల్ల ధరల దాడి వాటికి పట్టడం లేదు. బిజెపి అయితే కేంద్రంలో అధికారంలో ఉన్నా ఈ వ్యవహారాలను చూడడం లేదు.

పార్టీలో కొత్త కార్యవర్గం, రానున్న పలు రాష్ట్రాల ఎన్నికలతో తలమునకలుగా ఉంది. తాజాగా నియమించిన నితిన్ నబీన్ టీమ్‌లో మళ్లీ రామ్ మాధవ్‌కు చోటు కల్పించారు.దాదాపు ఆరు సంవత్సరాలుగా బీజేపీకి దూరంగా ఉన్న సిద్దాంతకర్త రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్షుడిగా స్థానం కల్పించగా,14 మంది ఉపాధ్యక్షుల్లో 11 మంది, 18 మంది ప్రధాన కార్యదర్శుల్లో 11 మందికి 'సంఘ్' వాసనలు ఉన్నాయని అంటున్నారు. ఎలాంటి సమాచారాన్ని అయినా సత్వరం ప్రచారం చేయగల, ప్రత్యర్థులపై శక్తి సామర్థ్యాలున్న ఐటీ సెల్ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయను 11సంవత్సరాల తర్వాత ఆ పదవి నుంచి తొలగించడం, దుందుడుకు భాషను ప్రయోగించే తేజస్వి సూర్యలాంటి వారిని తప్పించడం వంటివి జరిగాయి. ఒకప్పుడు వెంకయ్య, సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ, అనంతకుమార్ తదితర దిగ్గజ నేతలతో అలరారిన పార్టీ ఇప్పుడు పేలవంగా తయార వుతోంది. నితీన్ నబీ అధ్యక్షుడు అయ్యాక పార్టీ పెద్దగా ప్రభావశీలంగా కనిపించడం లేదు. గడచిన 12 సంవత్సరాల్లో సాధించిన విజయాలు చెప్పుకోవడానికి ఎప్పుడూ మోడీ ముందుంటారు. అయితే అందులో ధరలు తగ్గించగలిగామని ఎప్పుడూ చెప్పలేదు. ధరలపై సమీక్షకు పెద్దగా సమయం కేటాయించ లేదు. తాజాగా ఇప్పుడు దిమాగీ నక్సల్స్ మాటతో మళ్లీ కొత్త చర్చ లేపారు. అయితే మోదీ ఆ పదానికి నిర్వచనం ఇవ్వలేదు. 12 ఏళ్లు నిరాఘాటంగా పాలించిన అనుభవంతో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పెద్దగా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కేవలం ఎన్నికలు, గెలుపు అన్న ధోరణిలో పాలన సాగిస్తున్నారు. ఈ క్రమంలో పరిశీలిస్తే పాలక పార్టీలు ఏవీ కూడా ధరల గురించి మాట్లాడడం లేదు. 80కి కిలో బియ్యం కొనడమెలా ఆలోచించడం లేదు. జిఎస్టీ వసూళు పెరుగుతున్నాయా లేదా అన్నది చూసుకుంటూ మురిసిపోతున్నారు. ప్రజల విషయంలో ఇప్పటికైనా ఆలోచన చేయాలి. ధరల పెరుగుదలను అరికట్టడమెలా అన్నదానిపై దృష్టి సారించాలి. లేకుంటే వ్యాపారుల ఇష్టారాజ్యంగా మార్కెట్ మారిపోవడం ఖాయం.

# వందేమాతరంపై రాజకీయ వివాదం

### కాంగ్రెస్ తీరును ఎండగట్టిన బిజెపి

**కొత్త ముస్లింలీగ్ పార్టీ అంటూ నితిన్ నబీన్ విమర్శలు**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 :** జాతీయ గేయం 'వందే మాతరం' విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. పార్టీ కార్యక్రమాల్లో వందే మాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న తమ 1937 నాటి నిర్ణయానికే కట్టుబడి ఉంటామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. మరోవైపు కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ నిర్ణయం ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తు తోందని ఆరోపించింది. వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించిన కాంగ్రెస్‌పై భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర విమర్శలు చేశారు. ఓట్ల కోసం కాంగ్రెస్ 'కొత్త ముస్లిం లీగ్'గా మారిందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో తీవ్రస్థాయిలో స్పందించారు. వందేమాతరాన్ని అవమానించడం దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను అవమానించడమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బుధవారం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న తీర్మానాన్ని అనుసరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. ఇకపై పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని స్పష్టం చేసింది. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి రూపాన్ని ఆలపించే విషయంలో చోటుచేసుకున్న వివాదాన్ని నబీన్ పరోక్షంగా ప్రస్తావించారు. వందేమాతరంపై తన వైఖరిని కాంగ్రెస్ తీర్మానం రూపంలో అధికారికం చేసిందన్నారు. ఓటు బ్యాంకు కోసం దేశ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పదేపదే తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ సమర్థన కాదని, ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది మాట్లాడుతూ.. వందే మాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి తామే వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ ఇప్పుడు జాతీయ గేయాన్ని పూర్తిగా గౌరవించేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగం, పార్లమెంట్, దేశం కంటే పార్టీ నిర్ణయానికే కాంగ్రెస్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్‌ను తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాంగ్రెస్ తీరు చారిత్రక ముస్లిం లీగ్ వైఖరిని గుర్తుకు తెస్తోందని, ఆ పార్టీ కొత్త ముస్లిం లీగ్‌గా మారిందని ఆరోపించారు. 1931లో వందే మాతరం పూర్తి రూపంపై ముస్లిం లీగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కాంగ్రెస్ నిర్ణయం కూడా అదే తరహా మొండితనాన్ని ప్రతిబింబిస్తోందని బీజేపీ విమర్శించింది.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

- వీర్‌భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం
- ఎక్స్ వేదికగా రాజీవ్‌ను స్మరించుకున్న ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 :** భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించబడుతుందని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ జరుపుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యువతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం.. ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా భారతీయ యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాకుండా, భిన్నత్వంలో ఏకత్వం అనే భారతదేశ సంప్రదాయాలు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు. కాగా, ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984వ సంవత్సరంలో భారతదేశానికి 40 ఏళ్ల వయసులో రాజీవ్ గాంధీ 6వ ప్రధానమంత్రి అయ్యారు.





# పాకిస్థాన్‌లో దారుణ ఘటన

### యూట్యూబర్‌ను కాల్చి చంపిన దుండుగులు

**లాహోర్, ఆగస్ట్ 20 :** పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ టిక్‌టాకర్, యూట్యూబర్ షమ్నా బీబీ దారుణ హత్యకు గురయ్యారు. 28 ఏళ్ల ఈ యువతికి టిక్‌టాక్‌లో 1.3 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఆగస్టు 14న టాక్సిలా నగరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. షమ్నా తన సోదరుడు, సోదరితో కలిసి కారులో వెళ్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి కాల్పులు జరిపారు. మృతురాలి తండ్రి ఫజల్ సాహిబ్‌జాదా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. కాశిఫ్ అనే వ్యక్తి షమ్నాకు ఫోన్ చేసి ఇంటి నుంచి బయటకు రావాలని చెప్పాడు. దీంతో ఆమె తన చెల్లి, తమ్ముడితో కలిసి కారులో బయటకు వచ్చారు. కాసేపటికే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి షమ్నా ప్రయాణిస్తున్న కారును అడ్డగించారు. ఆ వెంటనే తుపాకీతో కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో షమ్నా బీబీ మెడలోకి బు÷-లలెట్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే ప్రమాదంలో షమ్నా బీబీ సోదరి అసీమా కూడా తీవ్రంగా గాయపడింది. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు ఇంకా పరారీలో ఉన్నారు. అయితే నిందితులకు షమ్నాబీబీకి సంబంధించిన సమాచారం అందించినట్లు అనుమానిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది. హత్యపై రావల్పిండి పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. షమ్నా బీబీ హత్యకు ఆమె నిర్వహిస్తున్న సోషల్ మీడియా కార్యకలాపాలు కారణం కాదని, ఆర్థిక వివాదమే కారణమై ఉండొచ్చని ఆమె కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కౌసర్, జావేద్ అలియాస్ షాహీన్‌తో షమ్నాకు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని తండ్రి పోలీసులకు తెలిపారు. 2026 మార్చిలో టిక్‌టాక్ క్రియేటర్ సనా జావేద్ అనే యువతి కూడా ఇస్లామాబాద్‌లో ఇదే తరహాలో హత్యకు గురయ్యారు.

# తెలంగాణలో 22ఎ సెక్షన్ దుర్వినియోగం

### రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ

**హైదరాబాద్,ఆగస్ట్20 :** తెలంగాణలో 22ఎ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఊఓఆం అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22ం జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల దందా సాగుతుంది. నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు 30? కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. 22ంపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దీనిపై వెంటనే స్వతంత్ర విచారణకు రేవంత్ ప్రభుత్వం ఆదేశించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు అని లేఖలో పేర్కొన్నారు.

# యూరియా యాప్ నిషేధించాలి

### ఎడవల్లిలో రైతుల రాస్తారోకో

**నిజామాబాద్, ఆగస్ట్ 20 :** యూరియా యాప్ రద్దు చేయాలని నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని షాటాపూర్ గేటు వద్ద బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై మండల బీఆర్ఎస్ శ్రేణులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ యూరియా యాప్ కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒక ఎకరానికి రెండు యూరియా బస్తాలు సరిపోవని, కనీసం నాలుగు బస్తాలు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు సకాలంలో యూరియా, ఎరువులు అందించడంతో పాటు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాతో ప్రధాన రహదారిపై అరగంట పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

# హర్మూజ్‌లో అమెరికా రహస్య షిప్పింగ్ కారిడార్

**వాషింగ్టన్ :** హర్మూజ్ జలసంధిలో అమెరికా సైన్యం రహస్య షిప్పింగ్ కారిడార్‌ను నిర్వహిస్తోంది. దీని నుంచి గుట్టుగా నౌకలను జలసంధి దాటిస్తున్నట్లు అమెరికా పత్రిక సంచలన కథనం ప్రచురించింది. కాల్పుల విరమణ కొనసాగించేందుకు ట్రంప్ నిరాకరించిన నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కొన్ని వారాల నుంచి అమెరికా దళాలు రాత్రి సమయంలో రహస్యంగా 15-20 వరకూ ట్యాంకర్లను సురక్షితంగా హర్మూజ్‌ను దాటిస్తున్నాయి. ఒమన్ తీరానికి సమీపంలోని దక్షిణ ఛానెల్ మార్గాన్ని దీనికి వినియోగిస్తున్నాయి. ఈ లెక్కన రోజుకు కనీసం కోటి బ్యారెళ్ల చమురు అందుబాటులోకి వస్తోంది. యుద్ధానికి ముందు సరఫరా అయ్యే చమురులో ఇది సగానికి సమానం. దీంతో పాటు ఖాళీ ట్యాంకర్లు తిరిగి గల్ఫ్ దేశాల్లో రేవులకు వెళ్లి చమురు నింపుకొని వచ్చేందుకు అమెరికా సైన్యం సాయం చేస్తోంది. ఈ మొత్తం ఆపరేషన్‌ను అమెరికాలోని నార్త్ కరోలినా ఫోర్ట్ బ్రాగ్‌లోని అమెరికా టాస్క్ ఫోర్స్ సమన్వయం చేస్తోంది. దీనికి గల్ఫ్‌దేశాల నుంచి సహకారం లభిస్తోంది. టాస్క్ ఫోర్స్ నిర్దేశిత సమయాల్లోనే ట్యాంకర్ల కాన్వాయ్‌లు కదులుతున్నాయి. ఇటీవల రెండు వారాలపాటు జరిపిన దాడుల్లో ఇరాన్ మారిటైమ్ రాడార్, నిఘా వ్యవస్థలను అమెరికా దారుణంగా దెబ్బతీసింది. ఒమన్ వైపు సముద్రంపై నిఘా పెట్టే సామర్థ్యాన్ని దెబ్బతీసినట్లైంది. తాజాగా నౌకలపై డ్రోన్ దాడులను అడ్డుకొనేందుకు అమెరికా వాయుసేన ఫైటర్ జెట్స్ రక్షణగా వెళ్తున్నాయి.

# మహిళ కడుపులో గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్

### ప్రసవం కోసం వెళ్లిన సమయంలో నిర్లక్ష్యంగా సర్జరీ

**ముంబై, ఆగస్ట్ 20 :** ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లిన 19 ఏళ్ల మహిళకు డాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఆపరేషన్ చేసిన తర్వాత ఆమె కడుపులోనే గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్ వదిలేసి కుట్టేశారు. ఈ ఘటన మహారాష్ట్రలో కలకలం రేపింది. తీవ్ర కడుపునొప్పి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ ఘటనపై ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించింది. వద్వాణి గ్రామానికి చెందిన సంధ్య ఆగస్టు 1న ప్రసవం కోసం బీడ్ జిల్లా ఆస్పత్రిలో చేరారు. అదే రోజు సాయంత్రం ఆమెకు ఆపరేషన్ చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకే ఆమెకు తీవ్రమైన కడుపు నొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. మహిళ ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన స్కానింగ్‌లో ఆమె కడుపులో ఏవో వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. రిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను పుణెలోని సాసూన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మరోసారి శస్త్రచికిత్స నిర్వహించి, ఆమె కడుపులో ఉన్న గ్లౌజులు, పేపర్ వైప్స్ ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించారు. తన భార్య పరిస్థితికి మొదటి ఆపరేషన్‌లో జరిగిన నిర్లక్ష్యమే కారణమని సంధ్య భర్త సూరజ్ గైక్వాడ్ ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

**జోగులాంబ గద్వాల, ఆగస్ట్ 20 :** విహారంలో విషాదం చోటు చేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సందర్శనకు వచ్చి రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. ధరూర్ మండల జూరాల ప్రాజెక్టు రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజక వర్గానికి చెందిన శివకుమార్(మల్లేపల్లి), గణేష్ (పీర్లగుట్ట), శ్రీకాంత్ (పెద్దాయపల్లి) ముగ్గురు కలిసి బైక్ పై జూరాల ప్రాజెక్టు సందర్శనకు వచ్చారు. బైక్ పై గద్వాల వైపు వెళ్తున క్రమంలో డ్యాం రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేక్ వద్ద బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్ కు ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు కిందపడ్డారు. గణేష్, శివకుమార్ లకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని గద్వాల జిల్లా దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మహబూబ్ నగర్ జిల్లా హాస్పిటల్‌కు తరలించారు.

# అర్ధరాత్రి బావిలోకి దూసుకెళ్లిన కారు

### ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

**సిద్దిపేట, ఆగస్ట్ 20 :** సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈవిషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బాక మండలంలోని బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్స్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి తమ స్వగ్రామానికి కారులో వస్తుండగా బుధవారం అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి బావిలో పడిపోయారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో బావిలో నుంచి కారును, నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందడంతో బలవంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలకం

### ఆర్థిక శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉంది

### దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకరాం ముఖ్యం

### సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు



**చెన్నై, ఆగస్ట్ 20 :** వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది ప్రాంతం కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. కేంద్ర - రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని ఏపీ సీఎం సూచించారు. గురువారం తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారమే లక్ష్యమని తెలిపారు. దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందని ఆయన గుర్తు చేశారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9,10 సంస్థలు.. 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదన్నారు. విభజన సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులు కేంద్ర సహకారంతో సాకారం అవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడును అనుసంధానించేలా బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఆయన ప్రతిపాదించారు. కుప్పం మీదుగా బులెట్ ట్రైన్ నడపాలని పేర్కొన్నారు. రాజధాని అమరావతి - బెంగళూరు - చెన్నై నగరాలను అనుసంధానించేలా ఈ రవాణా వ్యవస్థ ఉండాలని స్పష్టం చేశారు. అలాగే దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్ వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను సీఎం చంద్రబాబు వివరించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానిం చాలనీ చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని తెలిపారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునేలా మ్యూచువల్ ఎయిడ్‌ఫోర్స్ ఏర్పాటును ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్ ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. రాజధాని అమరావతికి చట్టబద్ధ రాజధాని హోదా సాధించామని ఈ సందర్భంగా ఏపీ సీఎం గుర్తు చేశారు. వనరుల లోటు, సెక్షన్ 56లోని అంశాలను పరిష్కరించాలనీ కేంద్రాన్ని ఆయన కోరారు. దుగ్గరాజుపట్నం పోర్టు, గ్రీన్‌నైరీ ప్రతిపాదనలకు వేగంగా అనుమతులు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే కడప జేఎస్‌డబ్ల్యూ రైల్వే లింక్‌కు కూడా కేంద్ర అనుమతులు మంజూరు చేయాలన్నారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకుపైగా నీటిని మళ్లించే ప్రతిపాదన ఉందన్నారు. గోదావరి - కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గంగా - కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక ఆవశ్యకతను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వివరించారు. నదుల అనుసంధానం పై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కోరారు. సహకారం, సమన్వయంతోనే దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని దక్షిణాది రాష్ట్రాల సీఎంలు కొనియాడారు. దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్‌తో సీఎం చంద్రబాబు మాట్లాడారని ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు ముఖ్యమంత్రులు పేర్కొన్నారు. సీనియర్ నాయకుడిగా విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారంటూ సీఎం చంద్రబాబును కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రశంసించారు.



## మత్స్యకారుడి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం

### హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి

**అమరావతి, ఆగస్ట్ 20 :** సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు అప్పన్న ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, కోస్ట్‌గార్డ్ సమన్వయంతో విస్తృతంగా గాలింపు చేపట్టాలని సూచించారు. ఈనెల 16న 8 మంది మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా.. సముద్ర తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ప్రమాదం జరిగిందని, ఈ ఘటనలో అప్పన్న గల్లంతయ్యారని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన మత్స్యకారుల పరిస్థితిపైనా అనిత ఆరా తీశారు. గల్లంతైన అప్పన్నను క్షేమంగా గుర్తించి కుటుంబసభ్యుల వద్దకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని ఆదేశించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని హోంమంత్రి తెలిపారు.

## లే ఔట్‌లోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యం

### ఫిర్యాదు కేసులో విచారణకు భూమన హాజరు



**తిరుపతి, ఆగస్ట్ 20 :** తిరుపతి మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత భూమన కరుణా కరరెడ్డి తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. తిరుపతికి చెందిన వెంకటేశ్వర ప్రసాద్ ఫిర్యాదు ఆధారంగా ఈనెల 12న పోలీసులు కేసు నమోదు చేశారు. కరుణాకరరెడ్డితో పాటు ఆయన కుమారుడు అభినయ్ రెడ్డి.. వ్యక్తిగత న్యాయవాదితో కలిసి విచారణకు వచ్చారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరు చానూరు సీఐ సునీల్ కరుణాకరరెడ్డిని ప్రశ్నించారు. వైకాపా హయాంలో 2023 నవంబరు 4వ తేదీన కరుణాకరరెడ్డి, ఆయన అనుచరులు తిరుపతి రూరల్ మండలంలోని తనపల్లిలో తనకు చెందిన 7.91 ఎకరాల అప్రూవ్డ్ లేఅవుట్ లోకి దౌర్జన్యంగా ప్రవేశించి దశాబ్దాల కిందట నాటిన మామిడి, టేకు, జామ, నేరేడు చెట్లను కొట్టేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ భూమిలో నుంచి భూమన కుటుంబానికి చెందిన మామిడి తోటకు రోడ్డు వేసేందుకు యత్నిం చారని, అక్కడున్న తన మనుషులను బెదిరించారని వెంకటేశ్వర ప్రసాద్ వివరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను తిరుచానూరు సీఐ సునీల్‌కు అందజేశారు. ఈనెల 12న బాధితుడు ఫిర్యాదు ఇవ్వగా అదేరోజు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై భూమన, ఆయన కుటుం బసభ్యులు హైకోర్టును ఆశ్రయించగా విచారణకు సహకరించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు కొనసాగించవచ్చని అధికారులకు సూచించింది. ఈ క్రమం లో భూ ఆక్రమణలకు సంబంధించి భూమనను పోలీసులు ప్రశ్నించారు.

## బార్క్ ప్రాజెక్టుకు భారీ ఊరట

### రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ, ఫీజుల మినహాయింపు

**అమరావతి, ఆగస్ట్ 20 :** అనకాపల్లి జిల్లాలో చేపట్టనున్న బార్క్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఊరట కల్పించింది. ప్రాజెక్టు కోసం భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన స్టాంప్ డ్యూటీ, ఫీజులను మినహాయిస్తూ నిర్ణయం తీసుకుంది. అనకాపల్లిలో 4,950 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్‌కు ఫీజులను మినహాయిస్తూ సర్కార్ జీవో జారీ చేసింది. తొలి దశలో అచ్చుతాపురం, మునగపాక మండలాల్లోని 1,947.225 ఎకరాల భూములకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు వర్తించనుంది. అనంతరం మిగిలిన భూములకు కూడా దశలవారీగా ఈ రాయితీని రెవెన్యూ శాఖ వర్తింపజేయనుంది. అచ్చుతాపురం ప్రాంతంలో క్లీన్ ఎనర్జీ, అణు పరిశోధన, రేడియేషన్ సాంకేతికతపై పరిశోధనలు నిర్వహించే కేంద్రాన్ని బార్క్ ఏర్పాటు చేయనుంది. దేశ రక్షణ, ఇంధనం, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో పరిశోధనల కోసం బీఏఆర్‌సీ ప్రాజెక్ట్ కీలకంగా మారనుంది. భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఫీజుల మినహాయింపుపై భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 285(1) నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ఆదాని డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

### రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం

**అమరావతి, ఆగస్ట్ 20 :** ఏపీలో డేటా సెంటర్ల ఏర్పాటుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అదానీ ఇన్ఫ్రా ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం తెలిపింది. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి సంబంధించిన విక్రయ ఒప్పందాల్లో మార్పులకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అదానీ ఇన్ఫ్రా అనుబంధ సంస్థలైన విశాఖ హైపర్‌స్కేల్, మెగా, రాంబిల్లి డేటా సెంటర్ పార్కులకు సవరించిన నిబంధనలు వర్తించనున్నాయి. రాష్ట్రంలో డేటా సెంటర్ల ద్వారా భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో విదేశీ వాణిజ్య రుణాలు పొందేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భూ కేటాయింపు రద్దు నోటీసులు జారీ చేయడానికి ముందు సంస్థలకు 30 రోజుల సమయం ఇచ్చేలా ఒప్పందంలో సవరించింది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5.84 ఎకరాల భూమిని అదానీ సంస్థకు లీజుకు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దేవాదాయ శాఖ భూములకు వర్తించే లీజు రేట్ల ప్రకారం, ఎస్ఆర్ఓ విలువలో 3 శాతం చొప్పున లీజు రేటును నిర్ణయించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. జీఎస్టీ ఆదాయం రాష్ట్రానికే వచ్చేలా డేటా సెంటర్ నిర్మాణాలు, సరఫరాదారులు ఏపీలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏపీ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## సిక్కు వ్యతిరేక అల్లర్ల నిందితుడు

### జైలులోనే సజ్జన్ కుమార్ మృతి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 :** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ (80) కన్నుమూశారు. ఢిల్లీలోని తీహార్ జైల్లో ఉన్న ఆయనను గురువారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు. సజ్జన్ మృతికి గల కారణాలు ఆసుపత్రి వర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1984లో సిక్కు మతస్తులైన తన బాడీ గార్డుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ సహా ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సిక్కులపై భారీ స్థాయిలో మూక దాడులు జరిగాయి. ఇందుకు సంబంధించి కొన్ని కేసుల్లో సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. ఈ దాడుల్లో సిక్కుల వ్యాపారాలు, నివాససముదాయాలపై దాడులు జరిగాయి. అనేక మంది కన్నుమూశారు. అధికారిక గణాంకాల ప్రకారం, నాటి దాడుల్లో 3 వేల పైచిలుకు మంది కన్నుమూశారు. పలామ్ కాలనీ ఏరియాలో జరిగిన ఐదుగురి హత్య ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు సజ్జన్ కుమార్‌ను 2018లో దోషిగా తేల్చింది. యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆ తరువాత ఢిల్లీ సారస్వత్ నగర్‌లో ఇద్దరు సిక్కుల హత్య కేసులో ఢిల్లీ హైకోర్టు 2025లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే, ఢిల్లీలోని జనక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనల కేసులో మాత్రం సజ్జన్ పాత్రను నిరూపించే ఆధారాలు లేకపోవడంతో కోర్టులో విముక్తి లభించింది. జాట్ వర్గం కీలక నేత సజ్జన్ కుమార్ 1980ల్లో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1977లో స్థానిక కౌన్సిలర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తరువాత ఔటర్ ఢిల్లీ నియోజకర్గం నుంచి మూడు సార్లు ఎంపీగా గెలిచారు.



## ట్రంప్‌ది ‘ఆర్థిక ఉగ్రవాదం’.. ఓటమి తప్పదు : ఇరాన్

**టెహ్రాన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశంపై ఆర్థిక యుద్ధం ప్రకటించడాన్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. భారీగా అప్పులు, విపరీతంగా పెరుగుతున్న వడ్డీ ఖర్చుల వంటి స్వీయ సంక్షోభాల నుంచి దృష్టి మళ్లించే చర్యగా దీనిని పేర్కొంది. విఫలమైన విధానాలను కొనసాగించడం వల్ల ముమ్ముందు కూడా ఓటమిని, ఇరాన్ ప్రజల శత్రుత్వాన్ని మూటగట్టుకోవడం తప్ప ఏమీ సాధించలేరని తెలిపింది. అమెరికా ‘ఆర్థిక ఉగ్రవాదం’.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, సార్వభౌమాధికారానికి ముప్పు కలిగిస్తుందని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ‘ఎక్స్’ వేదికగా పేర్కొన్నారు. అమెరికా అప్పులు 40 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయనే సూచించే మీడియా నివేదికలను ఆయన ప్రస్తావించారు. ఆర్థిక క్రమశిక్షణను పునరుద్ధరిస్తానని అధ్యక్షుడు ట్రంప్ హామీ ఇచ్చినప్పటికీ.. ఆయన అనుసరించిన అనేక విధానాలు రుణ భారాన్ని మరింత పెంచాయని అవి పేర్కొన్నాయి. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ట్రంప్ కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఇరాన్‌కు సాయం చేసే దేశాలు ఆర్థికంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇరాన్ ముప్పును ఎదుర్కోడానికి, దాన్ని ఏకాకిని చేసి, ఓడించడానికి మిత్రదేశాలన్నీ తమతో కలిసి నిలబడాలని పిలుపునిచ్చారు. ఆ దేశం ఎప్పటికీ అణ్వాయుధం కలిగి ఉండకూడదని ‘ట్రూత్ సోషల్’లో పోస్ట్ పెట్టారు.

## ప్రత్యక్ష పద్ధతిలో స్థానిక ఎన్నికలు

### అభినందనీయమన్న ఎంపి శ్రీభరత్

**విశాఖపట్నం, ఆగస్ట్ 20 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యక్ష పద్ధతిలో జడ్పీ ఎన్నిక జరగాలంటూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని విశాఖ ఎంపీ శ్రీభరత్ అభినందించారు. గురువారం విశాఖ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఎంపీ తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాలు నుంచి రాష్ట్రం ఇంకా పూర్తిగా రికవరీ అవ్వలేదని ఎంపీ అన్నారు. రాష్ట్రంలో మంచి ప్రతిపక్షం లేదని... ప్రతిపక్షంలో ఉన్నవారికి వారి పాత్ర అర్థం కావడం లేదని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో వలన నీటి సమస్య తలెత్తుతోందన్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని డేటా సెంటర్ల వలన నీటి సమస్య వస్తోందని కొన్ని శక్తులు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. డేటా సెంటర్లు రావడానికి ఇంకా రెండు సంవత్సరాలు సమయం పడుతుందని తెలిపారు. వర్షాలపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. పోలవరం నీటిని విశాఖకు తీసుకువస్తున్నారని, నదులన్నీ అనుసంధానం అయిన తర్వాత దక్షిణ భారతదేశంలో నీటి సమస్య తగ్గుతుందని ఎంపీ శ్రీభరత్ వెల్లడించారు

## అద్దెకున్న యువకుడి దురాగతం

### ప్రశ్నించిన పాపానికి ఓనర్ దారుణహత్య

**విశాఖపట్టణం, ఆగస్ట్ 20 :** విశాఖ నగరంలో ఓ విశ్రాంత ఉద్యోగి దారుణ హత్యకు గురయ్యారు. ఇంట్లో అద్దెకున్న వారిని ప్రశ్నించినందుకు వారే ఈ హత్యకు ఒడిగట్టారు. వివరాల్లోకి వెళితే.. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉన్న ఐదుగురు యువకులు మూడు రోజుల క్రితం ఖాళీ చేశారు. అయితే, వారు ఖాళీ చేసిన ఫ్లాట్‌లోని సామగ్రి ధ్వంసం చేశారనే కారణంతో యజమాని దుర్గాప్రసాద్ యువకులను పిలిపించారు. ఆయనతో మాట్లాడేందుకు వచ్చిన ఇద్దరు యువకులు వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ జరిగింది. వారిలో ఓ యువకుడు దుర్గాప్రసాద్‌పై దాడి చేయడంతో ఆయన మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 26 మిలాదున్ నబీ సెలవు

**అమరావతి, ఆగస్ట్ 20 :** మిలాద్-ఉన్-నబి పండుగకు సంబంధించిన సెలవు తేదీని మారుస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముందుగా ప్రకటించిన ఆగస్టు 25కు బదులుగా ఆగస్టు 26వ తేదీని బుధవారం సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. చంద్ర దర్శనం ఆధారంగా ఈ ఏడాది మిలాద్-ఉన్-నబి పండుగ ఆగస్టు 26న వస్తుందని ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు ప్రభుత్వానికి తెలియజేసింది. సెలవు తేదీని సవరించాలని వక్ఫ్ బోర్డు సీఈఓ చేసిన విజ్ఞప్తి మేరకు సెలవు తేదీని సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 26ను సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జె. శ్యామల రావు అధికారికంగా జీవో జారీ చేశారు.

## బార్ అసోసియేషన్‌కు జంధ్యాల రవిశంకర్ ఎన్నిక



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 :** సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల్లో జంధ్యాల రవిశంకర్ ఘన విజయం సాధించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జంధ్యాల రవి శంకర్.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విద్యను పూర్తి చేసి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. గతంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్లు, గవర్నర్లకు న్యాయ సలహాదారుగా రవిశంకర్ విశేష సేవలు అందిం చారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల బిల్లుకు వ్యతిరేకంగా ఏపీ హైకోర్టులో ఆయన వాదనలు వినిపించారు. గత వైసీపీ ప్ర భుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల బిల్లుకు వ్యతిరేకంగా ఏపీ హైకోర్టులో ఆయన వాదనలు వినిపించారు. 2023 నుంచి సుప్రీంకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న రవిశంకర్ పలు కీలక కేసుల్లో వాదనలు వినిపించారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తరఫున సుప్రీంకోర్టులో వాదించారు. తెలంగాణలోనూ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన పిటిషన్లలో అసెంబ్లీ స్పీకర్ తరఫున జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపిస్తున్నారు.

## భార్య మృతితో కలత చెందిన భర్త

### అంత్యక్రియలు చేస్తుండగా గుండెపోటుతో భర్త మృతి

**నంద్యాల, ఆగస్ట్ 20 :** జిల్లాలోని ఆత్మకూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీరామ్ నగర్‌లో నివాసం ఉంటున్న భార్యాభర్తలు ఒకే రోజు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. అనారోగ్యంతో భార్య లక్ష్మీదేవి మృతి చెందగా.. ఆమె అంత్యక్రియలు నిర్వహిస్తున్న సమయంలోనే భర్త సుబ్బరాయుడికి గుండెపోటు వచ్చినట్లు సమాచారం. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా.. అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలుస్తోంది. భార్య మృతిని తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన సుబ్బరాయుడు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోవడంతో విషాదం నెలకొంది. జీవితాంతం ఒకరికి ఒకరు తోడుగా నిలిచిన ఆ దంపతులు చావులోనూ తమ అనుబంధాన్ని వీడలేదంటూ స్థానికులు భావోద్వేగానికి గురవుతున్నారు.

జనం వార్త



# వరలక్ష్మి వ్రతంతో సకల శుభాలు



శ్రావణమాసం రెండో శుక్రవారం మహిళలు తాము ఇంట్లో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తే ఆ కుటుంబంలో సర్వ విఘ్నాలు తొలగిపోతాయని సకల శుభాలు కలుగుతాయని వేద పండితులు చెబుతున్నారు. శ్రావణ మాసానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది ఈ మాసం స్త్రీలకు అత్యంత శ్రేష్టమైనది కాకుండా ఉపవాసాలు భక్తితో అమ్మవారిని అనునిత్యం కొలుస్తూ ఉంటారు. గృహాలు శుభ్రం చేసుకోవడంతో పాటు వరలక్ష్మీ పూజకు అవసరమయ్యే సామగ్రి అయిన పువ్వులు, అరిటాకులు, చెరుకు గడలు, అరటి పళ్ళు, తమలపాకులు,వక్కలు, కొనుగోలులో మహిళలు బిజీగా ఉన్నారు దీనికి తోడు బంగారం వస్త్ర దుకాణాలు అమ్మవారి ప్రతిమల కొనుగోలుతో సందడిగా ఉన్నాయి.

## పూజా సామాగ్రి కొనుగోలుతో మహిళలు బిజీ

### భారీగా పెరిగిన ధరలు ఆలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు

### శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక కథనం:

శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం అంటారు ఈ రోజున వరలక్ష్మీ వ్రతం చేస్తారు ఆదిలక్ష్మి వరలక్ష్మి ఆమె బృంగునందిని భక్తుల పాలిట కొంగుబంగారం పరమ కృపాళువు. శ్రావణమాసం మహాలక్ష్మికి ప్రీతికరం. ఈ మాసంలోనే సోడోపచారాలు పూజలు జరిపి భక్షబోజ్జాయాలను సమర్పిస్తారు. ఈ దేవిని పూజిస్తే అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు సుమంగళిగా సౌభాగ్యం కలకాలం ఉంటాయని ఆర్యోక్తి. భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని మహిళలు ఇళ్లలోనూ సామూహికంగా ఆలయాలలోనూ నిర్వహిస్తారు. ఈ మాసంలో మొదటి శుక్రవారం కానీ ప్రధానంగా రెండో శుక్రవారం కానీ ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. వరప్రదాయిని అయిన లక్ష్మీదేవి విశ్వజన్నీ శ్రీ మహావిష్ణువు సతీమణి ఆమె భక్తశులభురాలు. ధనానికి మూలమైన ఆమె ధనంతో పాటు ధైర్యం, శౌర్యం, విద్య,వివేకం, సంతానం,ధాన్యం , ప్రసాదించే అష్టలక్ష్మిగా అన్ని సమకూర్చే వరాల తల్లి లక్ష్మీదేవి విశిష్టత శ్రీ సూక్ష్మణులు చక్కగా వివరించబడింది ఆమెను నిత్యం పూజించడం విధిగా ఆచరించవలసిన కర్మ. శ్రావణ శుక్రవారం రోజున ఆమెను వరలక్ష్మి పేరిట పూజించడం సాంప్రదాయం. వరలక్ష్మీ వ్రతంలో మహా ఋషులు సూచించిన సదాచారాలు పాటిస్తే అమ్మదయ కలుగుతుం దని పెద్దలు చెబుతారు. మహిళలు సౌభాగ్యదాయకమైన ఈ వ్రత విధానాన్ని దీని మహత్తుషారుమతి అనే సాధ్వి కథను పార్వతికి శివుడు చెప్పినట్లు శౌనుకాది మహా ఋషులకు సుతముని వివరించాడు . వరలక్ష్మీ వ్రతం ఆచరించి ఆమెను ఆరాధించి పిండివంటలతో నైవేద్యం పెట్టే పూజిస్తే కోరుకున్నవన్నీ సమకూరుతాయని పురాణాలు పేర్కొంటున్నాయి.



## వ్రతం చేసే విధానం

స్త్రీలు తెల్లవారుజామునే స్నానం ఆచరించి పట్టు వస్త్రాలు ధరించి గణపతికి మొదటి పూజ నిర్వహించి అక్కడే కలశ స్థాపన చేయాలి . అమ్మవారి ప్రతిమను ప్రతిష్టికి ఆభరణాలు వివిధ రకాల వస్తువులను అమ్మవారి ముందు ఉంచి భక్తిశ్రద్ధలతో పూజించాలి. అనంతరం కంకణ ధారణ చేసి కలశ గణపతి గౌరీ ఆరాధన చేయాలి. చారుమతి కథలు విని అమ్మవారి అక్షింతలు శిరస్సుపై తల్లుకోవాలి తోటి మహిళలను పిలిచి వారికి పసుపు బొట్లు పండ్లు తాంబూలాలు ఇచ్చి ఆశీస్సులు పొందాలి. దీనితో వరలక్ష్మీ వ్రతం సంపూర్ణం అవుతుంది.

## భారీగా పెరిగిన సామాగ్రి ధరలు

శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించేందుకు నగరవాసులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పువ్వులు ఇతర సామాగ్రి కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపించడంతో గురువారం మార్కెట్లో వినియోగదారులతో కళ కళలాడాయి. ఎటు చూసినా సందడే కనిపించింది. అయితే పండుగ సందర్భంగా పువ్వులు ఆకులు పూజా సామగ్రి ధరలు పెరిగిపోయాయి. బంతిపూలు సాధారణ రోజుల్లో కన్నా ఎక్కువ ధరలకు విక్రయించారు. అంతేకాకుండా పండగలు కూడా ఆకాశాన్ని అంటాయి. రెండు రూపాయలకు ఒక తమలపాకులు విక్రయించారు దీనితో సగటు వినియోగదారులు అవస్థలు పడ్డారు. స్వగృహ ఫుడ్స్ లో గారెలు పులిహోర కొరుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు శ్రావణ శుక్రవారం సందర్భంగా దేవాలయాలు నిర్వాహకులు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

# మార్కెట్లకు పండుగ సందడి

నేడు శ్రావణ శుక్రవారం దీనితో కొనుగోలుదారులతో కిక్కిరిసిన పూల మార్కెట్లు ఆకాశాన్నింటిని పూల ధరలు పూజా సామాగ్రి అయినా భారీగా కొనుగోలు చేసిన సామాన్య మధ్యతరగతి ప్రజలు. హిందూ సాంప్రదాయంలో శ్రావణ మాసానికి ఉన్న ప్రత్యేకత వేరే చెప్పనక్కరలేదు. ముఖ్యంగా మహిళలు పండుగలు పేరంటాలు ఆలయాలలో ప్రత్యేక పూజలు ఇతర శుభకార్యాలతో బిజీగా ఉండేది ఈ మాసమే. ఒక్కమాటలో చెప్పాలంటే శ్రావణమాసం వచ్చిందంటే ఇండ్లు ఆలయాలతో పాటు మార్కెట్లలోనూ శ్రావణ సందడి కనిపిస్తుంది. శ్రావణ శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది . శ్రీ మహావిష్ణువు లక్ష్మీని వరలక్ష్మిగా ఆరాధిస్తారని పురాణ కథలు చెబుతున్నాయి. వరలక్ష్మీ వ్రతం చేస్తే కోరిన కోరికలు తప్పక నెరవేరుతాయని అనాదిగా వస్తున్న విశ్వాసం దీనితో ఈ వ్రతాన్ని మహిళలు ప్రత్యేక భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఒకరోజు ముందు నుంచే వరలక్ష్మి వ్రతానికి సర్వం సిద్ధం చేసుకుంటారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు గుడి మల్కాపూర్, లోని ఇంద్రారెడ్డి పూల మార్కెట్ కిక్కిరిసిపోయింది. వరలక్ష్మీ వ్రతం పూజలు పూజా సామాగ్రి కొనేందుకు పెద్ద ఎత్తున వినియోగదారులు రావడంతో మార్కెట్ కిటకిటలాడింది పూల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. వరలక్ష్మీ వ్రతం జరుపుకోవాలనే సంకల్పంతో మహిళలు ధర ఎంతైనా సరే



వెచ్చించి కొనుగోలు చేశారు ప్రధానంగా కమలాపులు లక్ష్మీ పూజకు ప్రత్యేకం కావడం వల్ల వాటి ధరలు వ్యాపారులు ఒక్కసారిగా పెంచేశారు కమలం పూలు జత 80 నుండి 150 వరకు విక్రయించారు అంతేకాకుండా అరటి కొమ్మలు జత 80 నుంచి 150 వరకు విక్రయించారు ఇక ఇతర పూలు పళ్ళ ధరలు ఆకాశాన్ని అంటాయి వరలక్ష్మీ వ్రతం జరుపుకునే వారు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మార్కెట్లకు విచ్చేశారు. వరలక్ష్మి వ్రత పూజ కోసం అందంగా అలంకరించేందుకు వివిధ రకాల అలంకరణ పూలు భారీగా కొనుగోలు చేశారు దీనికి తోడు మారేడు పత్రికి డిమాండ్ పెరిగింది. విక్రయదారులు అందిన కాడికి అమ్ముకుంటూ లాభాలు దండుకున్నారు.

### ప్రతి సంవత్సరం వ్రతాన్ని నిర్వహిస్తాం

శ్రావణమాసంలోని రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఇంట్లో కుటుంబ సభ్యులతో నిర్వహించకుండా అష్టలక్ష్ములను వరలక్ష్మి దేవికి ఓ ప్రత్యేకత ఉంది మిగిలిన లక్ష్మి పూజల కంటే వరలక్ష్మి పూజ శ్రేష్టమని వేద పండితులు చెప్పడంతో ప్రతిసారి శ్రావణమాసంలో వ్రతం చేయడం వల్ల తమ కుటుంబంలో విశేష ఫలితాలు లభిస్తున్నాయి. వరలక్ష్మి వ్రతం పూజ అనంతరం తోటి మహిళలకు పసుపు బొట్టు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుంది. శ్రావణమాసం వచ్చిందంటే వరలక్ష్మీ వ్రతం ఎప్పుడు చేయాలనీ ఎదురుచూస్తూ ఉంటాం.

-ఏ.లక్ష్మి ( అల్మాస్ గూడ)

### ప్రతి స్త్రీ నిర్వహించుకోవాలి

వరలక్ష్మీ వ్రతం అనేది ఒక స్త్రీ తమ ఇంట్లో శ్రావణ శుక్రవారం రోజున నిర్వహించుకోవాలి. ఈ వ్రతాన్ని ఏ స్త్రీ అయితే తన ఇంట్లో నిర్వహించుకుంటారు సర్వమంగళం నిత్య సుమంగళీగా ఉంటారని విశ్వసిస్తారు. వరలక్ష్మి వ్రత పూజ అనేది జగదానంద కారకమైనదని భక్తులందరి నమ్మకం. అందుకే ప్రతి ఒక్క మహిళా శ్రావణమాసంలో ఈ వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి చారుమతి కథను చదివి ఆధ్యాత్మిక ఆనందం పొందుతారు.

– అక్కినేపల్లి భవ్య పీర్జాదిగూడ

### సామగ్రిని ముందుగానే కొనుగోలు చేశాం

శ్రావణమాసం వచ్చిందంటే చాలు మహిళలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న వరలక్ష్మి వ్రతం నిర్వహించుకోవడం కోసం ఒక్కరోజు ముందే వ్రతానికి సంబంధించి పూజా సామగ్రి కొనుగోలు చేశాం. శుక్రవారం తెల్లవారుజామున స్నానం ఆచరించి ఎంతో భక్తి భావంతో అమ్మవారి వ్రతాన్ని ఆచరిస్తాం. దక్షిణ భారతదేశంలో ఈ వరలక్ష్మీ వ్రతాన్ని వివిధ సంప్రదాయాలలో ఆచరిస్తారు ఎవరు ఏ పద్ధతులు పాటించినా వరలక్ష్మి కొలిచే తీరు మాత్రం ఒక్కటే అందుకే ఈ వ్రతానికి అంత ప్రాముఖ్యం ఉంది.

– సిరి ప్రగడ హరిత, హైదరాబాద్.

# భారీ లాభాల్లో ముగిసిన సూచీలు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. దీంతో వరుసగా ఏడు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. గురువారం సెషన్‌లో సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా బాండ్ల రాబడులు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కలిసొచ్చా యి. రియాల్టీ, ప్రైవేట్ బ్యాంక్, ఐటీ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఉదయం 77,468.45 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,909.68) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,611.11 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 628.04 పాయింట్ల లాభంతో 77,537.72 వద్ద ముగిసింది. నిఫ్టీ 153.55 పాయింట్లు పెరిగి 24,231.85 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.71గా ఉంది. సెన్సెక్స్ 30లో టైటాన్, హెచ్‌సీఎల్, ఇండి గో, టాటా స్టీల్ కంపెనీ షేర్లు తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 93.94డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,490.60 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ మార్కెట్ సూచీలు కూడా లాభాల్లోనే ట్రేడయ్యాయి.



## బిజినెస్



## భారీగా పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 20 :** అమెరికా ట్రెజరీ బాండ్ దిగుబడులు తగ్గడం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో దేశీయంగా బంగారం ధరలు భారీ పెరుగుదల నమోదు చేశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై మార్కెట్ అంచనాలు కూడా బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవా డలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,270గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.4300 మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,46,000గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.3950 మేర పెరిగింది. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలోకు రూ.10 వేల మేర పెరుగుదల నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది.



## శ్రీలంకతో రెండో టెస్టు..

### సారాంశ్ జైన్ ఎంట్రీ ఖాయమే..

శ్రీలంక, భారత్ మధ్య ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు ప్రారంభంకానుంది. గాలెలో గెలిచి ఊపుమీదున్న టీమ్‌ఇండియా కొలంబో వేదికగా జరిగే రెండో టెస్టులోనూ విజయం సాధించి లంకేయులను వైట్‌వాష్ చేయాలని భావిస్తోం ది. లంక టూర్ కోసం తొలిసారి టెస్టు జట్టు నుంచి పిలుపు అందుకున్న ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్ కొలంబో టెస్టులో అరంగేట్రం చేయడం ఖాయం గా కనిపిస్తోంది. అతడు తుది జట్టులో చోటు దక్కించుకునేందుకు బలమైన అవకాశాలున్నాయని జట్టు వర్గాలు జాతీయ మీడియాకు తెలిపాయి. ఆఫ్ స్పిన్నర్ అయిన సారాంశ్‌ను ఆడిస్తే ఎడమ చేతివాటం స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌పై వేటు పడటం ఖాయం. గాలెలో అతడు 25 ఓవర్లు వేసి ఒకే వికెట్ పడగొట్టాడు. మరోవైపు, మానవ్ సుతార్, రవీంద్ర జడేజా సత్తాచా టారు. వారిద్దరిని తుది జట్టు నుంచి తప్పించే పరిస్థితి లేదు. ఈ లెక్కన చూసకుంటే కుల్‌దీప్ యాదవ్‌ను పక్కన పెట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పైగా శ్రీలంక జట్టులో చాలా మంది ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారు. దీంతో ఆఫ్ స్పిన్నర్ అయిన సారాంశ్ వైపే టీమ్‌మేనేజ్‌మెంట్ మొగ్గుచూపే అవకాశాలు న్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ 33 ఏళ్ల వెటరన్ స్పిన్నర్ రెడ్‌బాల్ క్రికెట్‌లో అదరగొట్టి 11 ఏళ్ల నిరీక్షణ తర్వాత భారత జట్టు నుంచి పిలుపు అందుకున్నాడు. ఇటీవల ఇండియా 'ఎ' శ్రీలంక పర్యటనకు వెళ్లిన ఇతను రెండో అనధికార టెస్టులో ఆరు వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 70 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.



## రవీంద్ర జడేజా జోరు తగ్గింది

### రవిచంద్రన్ అశ్విన్

ఇటీవల కాలంలో స్పిన్నర్ రవీంద్ర జడేజా బంతితో చూపే ప్రభావం తగ్గిపోయిందని మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. జట్టులో అతడి పాత్ర మారిందని, స్పిన్నర్‌గా కంటే మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా కీలకంగా మారాడని పేర్కొన్నాడు. గాలెలో శ్రీలంకతో తొలి టెస్టులో భారత్ ఘనవిజయం సాధించిన తర్వాత అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. గాలె టెస్టులో యువ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్ మొత్తం 10 వికెట్లు పడగొట్టగా.. జడేజా నాలుగు వికెట్లు మాత్రమే తీశాడు. "జడేజా, మానవ్ సుతార్ పూర్తిగా భిన్నమైన ప్లేయర్లు. తన చేతుల్లో బంతిని తిప్పగలగడం సుతార్ బలం. జడేజా స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు సంధిస్తూ నియంత్రణ సాధిస్తాడు. జడేజా ఇప్పుడు అంత దూకుడైన స్పిన్నర్ కాదని భావిస్తున్నా. జట్టులో అతడి పాత్ర మారింది. ఇప్పుడు మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా అతను సహకారం అందించడం ముఖ్యం. మానవ్ సుతార్ గత టెస్టులోనూ, అలాగే ఈ టెస్టులోనూ వికెట్లు తీయడంలో సత్తాను చాటాడు. బ్యాటర్లు ఎలా ఆడతారో అంచనా వేసి దానికి అనుగుణంగా బౌలింగ్ చేస్తున్నాడు. మొదటి రెండు టెస్టుల్లో బౌలింగ్ నైపుణ్యాలను అద్భుతంగా ప్రదర్శించాడు. భారత స్పిన్ బౌలింగ్ విభాగానికి మానవ్ సుతార్ చాలా కీలకం" అని అశ్విన్ పేర్కొన్నాడు. శ్రీలంక, భారత్ మధ్య కొలంబో వేదికగా ఆదివారం (ఆగస్టు 23) నుంచి ప్రారంభం కానుంది.

## భారత్‌లోనే క్రేజ్ ఎక్కువ..

# నాకు రెండో ఇల్లు లాంటిది

### ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్



భారతదేశంతో తనకు బలమైన అనుబంధం ఉందని, తనకు రెండో ఇల్లు లాంటిదని ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ పేర్కొన్నాడు. సిడ్నీలోని భారత కాన్సులేట్ నిర్వహిం చిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో షేన్ వాట్సన్ పాల్గొని ప్రసంగించాడు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగమవడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తునని తెలిపాడు. ఆస్ట్రేలియా కంటే భారత్‌లోనే తనకు ఎక్కువ ఆదరణ లభిం చిందన్నాడు. తనకు 19 ఏళ్లు ఉన్నప్పుడు తొలిసారి భారత్‌లో పర్యటనకు వచ్చానని, అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఇండియా శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నాడు. శాకాహార వంటకా లు తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నాడు. "ఇలాంటి కార్యక్ర మాలలో పాల్గొనడం నాకెప్పుడూ ఒక ప్రత్యేకమైన అనుభూతి నిస్తుంది. భారతీయ ప్రజలు నా జీవితం, వృత్తిపై అద్భుతమైన ప్రభావం చూపారు. వారితో నాకు బలమైన అనుబంధం ఉ ంది. భారత్ నాకు మరో ఇల్లు. ఇది చాలా ఆసక్తికరమైన విషయం. ఆస్ట్రేలియా తరఫున సుదీర్ఘకాలం పాటు క్రికెట్ ఆడే అదృష్టం నాకు లభించింది. కానీ భారతదేశంలో నాకు ఎప్పుడూ ఎంతో ఆదరణ లభించేది. 2008లో ఐపీఎల్ ప్రారం భమైంది. నా కెరీర్‌లో కీలకమైన ఆ సమయంలో అద్భుతమైన ప్రదర్శనలు చేసే అవకాశం నాకు ఆ వేదిక ద్వారా దక్కింది. ఆస్ట్రేలియాతో పోలిస్తే భారత్‌లో క్రికెట్‌ను ప్రేమించే వారు చాలా ఎక్కువ మంది ఉన్నారు. కానీ, ఇండియాలో నన్నెప్పుడూ అంతగా విమర్శించలేదని నేను ఎప్పుడూ భావించేవాడిని. అక్కడ నాకు ఎక్కువ మద్దతు లభించేది. అదే ఆస్ట్రేలియాలో నైతే బాగా ఆడినప్పుడు ప్రశంసలు వచ్చేవి. ఒకవేళ బాగా ఆడకపోతే విమర్శలు ఎదురయ్యేవి" అని వాట్సన్ వివరిం చాడు. వాట్సన్ 2008 నుంచి 2020 వరకు ఐపీఎల్‌లో ఆడాడు. రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 145 మ్యాచ్‌లు ఆడి 3, 874 రన్స్ చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలున్నాయి. బౌలర్‌గా 92 వికెట్లు పడగొట్టాడు.

# యువరాజ్ సింగ్ కోచ్‌గా రెండో ఇన్నింగ్స్!



టీమిండియా మాజీ ఆల్‌రౌండర్, ప్రపంచకప్ విజేత యువరా జ్ సింగ్ కోచ్‌గా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. ఇప్పటికే మెంటార్‌గా ఆటగాళ్లకు దిశానిర్దేశం చేస్తున్న యువరాజ్ సింగ్.. ప్రొఫెషనల్ క్రికెట్‌లో అధికారి కంగా ఇప్పటి వరకు కోచ్‌గా వ్యవహరించలేదు. అప్‌కమింగ్ ఐపీఎల్ 2027 సీజన్‌లో యువరాజ్ సింగ్ కోచ్‌గా అరంగే ట్రం చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్ బాధ్యతలు చేపట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే యువరాజ్ సింగ్ నియామక ప్రక్రియ పూర్తయిందని, ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే బాధ్యతలు స్వీకరిస్తాడని ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2027 మినీ వేలంలో యువరాజ్ సింగ్ పాల్గొంటాడని తెలుస్తోంది. హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్‌కు కళ్లు చెదిరే పారితోషకం ఇచ్చేందుకు ఢిల్లీ యాజమాన్యం సిద్ధమైందని సమాచారం. రూ.9.5 కోట్ల భారీ వేతనంతో యువరాజ్ సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలోనే ఓ కోచ్ అందుకున్న అత్యధిక పారితోషకం ఇదే కావడం విశేషం. ఇప్పటి వరకు రికీ పాంటింగ్ పేరిట ఈ రికార్డ్ ఉంది. పంజా బ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా రికీ పాంటింగ్ రూ.9 కోట్ల వేతనం అందుకుంటున్నట్లు సమాచారం. అతని తర్వాత స్టీఫెన్ ఫ్లేమింగ్ రూ.7.5 కోట్లు, లక్నో సూపర్ జెయింట్స్ డైరెక్టర్‌గా జహీర్ ఖాన్ రూ. 5 కోట్లు, రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ రూ.4.5 కోట్లు, ఆండీ ఫ్లవర్, జస్టిన్ లాంగర్ రూ.4 కోట్ల చొప్పున వేతనం తీసుకున్నట్లు సమాచారం. ఐపీఎల్ చరిత్రలోనే ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పటి వరకు టైటిల్ గెలవలేదు. యువరాజ్ సింగ్ పర్యవేక్షణలోనైనా ఆ ముచ్చట తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఆ జట్టు ఉంది. రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరే అవకాశాలు ఉన్నాయి. లక్నో సూపర్ జెయింట్స్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న రిషభ్ పంత్.. తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ సారథ్య బాధ్యతలు చేపడుతాడని ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ ఆరంభంలో మెరుగైన ప్రదర్శన చేసినా.. కీలక సమయంలో చేతులెత్తేసింది. 14 మ్యాచ్‌ల్లో 7 మాత్రమే గెలిచి పాయింట్స్ టేబుల్‌లో ఆరో స్థానంలో నిలిచింది.

## సచిన్‌తో పోల్చితే

# కోహ్లినే అత్యుత్తమ ఆటగాడు

### సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్

భారత క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లిలో ఎవరు అత్యుత్తమం అనే చర్చ తరుచూ జరుగుతూనే ఉ ంటుంది. భారత క్రికెట్ ఐకాన్స్ అయిన ఈ ఇద్దరి మధ్య పోలిక అనవసరమని చాలా మంది మాజీ క్రికెటర్లు సమాధా నం చెప్పేందుకు తప్పించుకున్నారు. ఇద్దరి క్రికెటర్ల తరాలు భిన్నమైనవని, ఇద్దర్ని పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. కానీ తాజాగా సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్‌ను ఇదే ప్రశ్న అడగ్గా.. నిర్మొహమాటంగా సమాధానం చెప్పాడు. సచిన్‌తో పోల్చితే విరాట్ కోహ్లినే అత్యుత్తమ ఆటగాడని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టెస్టుల్లో విదేశీ గడ్డపై విరాట్ కోహ్లి రాణించినట్లుగా సచిన్ ఆడలేకపోయాడని తెలిపాడు. విరాట్ కోహ్లి విదేశీ గడ్డపై భారత బ్యాటింగ్ స్థాయిని పెంచారని, తన సమకాలీన ఆటగాళ్లు కూడా అక్కడి పరిస్థితుల్లో మెరుగ్గా రాణించేలా ప్రేరేపించారని ఏబీడీ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పేర్కొన్నాడు. 'విదేశాల్లో సచిన్ టెండూల్కర్ ఒక ప్రమాణాన్ని నెలకొల్పాడు. కానీ కోహ్లి ఆ ప్రదర్శనలను మరో స్థాయికి తీసుకెళ్లాడు. టెస్ట్ క్రికెట్‌లో 15,921 పరుగులు, 51 సెంచరీలతో సచిన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 176 ఇన్నింగ్స్‌ల్లో విదేశీ గడ్డపై 51 సగటుతో పరుగులు చేశాడు. మరోవైపు విరాట్ కోహ్లి 123 టెస్టుల్లో 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. విదేశాల్లో కోహ్లి సగటు 68 మ్యాచ్‌ల్లో 41గా ఉంది. భారత్ కోసం సచిన్ కొత్త ఒరవడిని ప్రారంభించినా.. విరాట్ కోహ్లి అంతటి స్థాయి అప్పట్లో సచిన్‌కు లేదు. విదేశాల్లో బౌన్సీ, సీమింగ్ పిచ్‌లపై కూడా రాణించవచ్చని నిరూపించిన మొదటి వ్యక్తి సచిన్'అని ఏబీ డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లి, సచిన్ టెండూల్కర్ అడుగుజాడల్లో దేవదత్ పడిక్కల్, కేఎల్ రాహుల్ కొనసాగుతున్నారని డివిలియర్స్ పేర్కొన్నాడు. 'కేఎల్ రాహుల్‌కు మంచి టెక్నిక్ ఉంది. అతను భారత జట్టుకు ఒక పెద్ద ఆస్తి. కానీ విదేశాల్లో అతని సగటు కేవలం 34 మాత్రమే. ఈ విషయంలో అతను ఇంకా మెరుగవ్వాలి. క్రీజులో సెట్ అయిన తర్వాత భారీ స్కోర్లు చేయాలి. కేవలం సెంచరీలే కాకుండా డబుల్ సెంచరీలు చేయాలి. ఎందుకంటే కొత్త బంతికి ఔటవ్వడం ఎప్పుడైనా జరగవచ్చు. కాబట్టి మెరుగైన ఆరంభాన్ని భారీ స్కోర్లుగా మల్చాలి'అని డివిలియర్స్ సూచించాడు.




## ఎస్‌బీఐ ప్రాథమిక పొదుపు ఖాతాపై

# కొత్త నిబంధనలు

ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (బీఎస్‌బీడీ) ఖాతాదారులకు అక్టోబరు 1 నుంచి కొత్త నిబంధనలను అమలు చేయనుంది. వీటికి నగదు ఉ పసంహరణ నిబంధనలను సవరిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఒక నెలలో మొదటి 4 నగదు ఉపసంహరణలు మాత్రమే ఉచితంగా లభిస్తా యి. ఈ పరిమితిలో ఎస్‌బీఐ ఏటీఎంలు, ఇతర బ్యాంకుల ఏటీఎంలు, బ్యాంకు శాఖలు, ఏఈపీఎస్ ద్వారా చేసే లావాదేవీలూ కలిసి ఉంటాయి. అయిదో లావాదేవీ నుంచి ప్రతి విత్‌డ్రాయల్‌పై రూ.15 వసూలు చేస్తుంది. దీనికి జీఎస్‌టీ అదనం. బీఎస్‌బీడీ ఖాతాలో కనీస నిల్వ (మినిమం బ్యాలెన్స్) ఉంచాలనే నిబంధన లేదు. ఖాతాలో ఎంత సొమ్ము అయినా దాచుకోవచ్చు. గరిష్ఠ పరిమితి లేదు. ఈ ఖాతాదారులకు ప్రాథమిక రూపే ఏటీఎం-కమ్-డెబిట్ కార్డు ఉచితంగానే జారీ చేస్తుంది. దీనిపై వార్షిక నిర్వహణ ఛార్జీలు ఉండవు. వీరికి చెక్కు పుస్తకం మాత్రం లభించదు. బీఎస్‌బీడీ ఖాతా ఉన్నవారు బ్యాంకులో మరో పొదుపు ఖాతా కలిగి ఉ ండకూడదు. ఒకవేళ ఉంటే, బీఎస్‌బీడీ ఖాతా తెరిచిన 30 రోజుల్లోగా పాత ఖాతా మూసివేయాలి. నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ వంటి మార్గాల ద్వారా నగ దు జమ చేయడానికి ఎలాంటి ఛార్జీ చెల్లించాల్సిన అవసరం లేదు. నిరు పయోగంగా ఉన్న ఖాతాను తిరిగి ప్రారంభించేందుకు, ఖాతాను రద్దు చేసు కునేందుకు ఎలాంటి రుసుములు ఉండవు. సరైన కేవైసీ పత్రాలు ఉన్నవా రెవరైనా వ్యక్తిగతంగా, లేదా ఉమ్మడిగా ఈ ఖాతా ప్రారంభించొచ్చు.




## గూగుల్ ఆఫర్: కాలేజీ విద్యార్థులకు

# ఏడాది పాటు 'ఏఐ ప్లస్' ఫ్రీ

ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ భారతీయ కాలేజీ విద్యార్థులకు శుభవార్త చెప్పింది. 'గూగుల్ ఏఐ ప్లస్' సబ్‌స్క్రిప్షన్‌ను ఏడాది పాటు ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించింది. గూగుల్ ఏఐ అసిస్టెంట్, సెర్చ్ ద్వారా ఎడ్యుకేషనల్ టూల్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అమెరికా లోని కాలేజీ విద్యార్థుల కోసం గూగుల్ ఏఐ ప్రో ప్లాన్‌ను ఉచితంగా అందిస్తుండగా.. ఇప్పుడు భారతీయ కాలేజీ విద్యార్థుల కోసం 'గూగుల్ ఏఐ ప్లస్'ను ఏడాది పాటు ఉచితంగా తీసుకురానుంది. జీ-మెయిల్, డాక్స్‌లో జెమినై సేవలు లభించనున్నాయి. రీసెర్చ్, అనాలసిస్ కోసం నోట్‌బుక్ ఎల్‌ఎమ్ కూడా వాడుకోవచ్చు. దీంతో పాటు ఫొటోలు, డ్రైవ్, జీమెయిల్ కోసం 400 స్టోరేజీని ఉచితంగా పొందొచ్చు. సాధారణంగా గూగుల్ ఏఐ ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధరను నెలకు రూ.399గా (ఏడాదికి రూ.4,788) కంపెనీ నిర్ణయించింది. గూగుల్ ఏఐ ప్లస్‌లో భాగంగా స్టడీ నోట్‌బుక్స్, ఫ్లాష్‌కార్డులను క్రియేట్ చేయడం, ప్రాక్టీస్ క్విజ్‌లు వంటి ఇతర సదుపాయాలను గూగుల్ కల్పిస్తుంది. జెమినై లైవ్ కూడా అందుబాటులో ఉంటుంది. విద్యార్థులకు గూగుల్ ఏఐ ప్రో, యూట్యూ బ్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌పై 70 శాతం డిస్కౌంట్‌ను కూడా ఆఫర్ చేస్తోంది. గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్‌తో యూట్యూబ్ ప్రీమియం లైట్ కూడా పొందొచ్చు. అర్హత కల్గిన విద్యార్థులు పర్సనల్ గూగుల్ అకౌంట్‌తో గూగుల్ వన్‌లో సైన్ అప్ కావొచ్చు. విద్యార్థుల అర్హతను గూగుల్ ప్లాట్‌ఫామ్ ద్వారా వెరిఫై చేయనుంది.




## రంభ ఊర్వశి మేనక నుంచి మరో పాట విడుదల

'రంభ ఊర్వశి మేనక' అంటూ అల్లరి చేయడానికి సిద్ధమయ్యారు అల్లరి నరేశ్. ఆయన ప్రధానపాత్రలో తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇందులోని రెండో పాటను విడుదల చేశారు. 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా' అంటూ సాగే ఈ పాటలో వెళ్లవే పేదరికం.. ఇక్కడే ఇల్లరికం అనే లిరిక్స్ నేపథ్యానికి తగినట్లుగా ఉన్నాయి. చంద్రమోహన్ చింతా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నరేశ్‌కు జోడీగా సురభి నటించారు.

## తల్లిదండ్రుల మధ్య సేదదీరిన విజయ్ దేవరకొండ

### ఫోటోను షేర్ చేసిన రష్మిక మందన్నా

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన కుటుంబంతో గడిపిన మధురమైన క్షణాలకు సంబంధించిన ఒక క్యూట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా విజయ్ తాజా సినిమా షూటింగ్ అనూహ్యంగా రద్దు కాగా, ఆ సమయాన్ని ఆయన పూర్తిగా తన కుటుంబంతో కలిసి విశ్రాంతిగా గడపాలని నిర్ణయించుకున్నారు. చిన్నతనంలో తాను ఎంతో ఇష్టపడే ప్రదేశంలో, తన తల్లిదండ్రుల మధ్య హాయిగా నిద్రపోతున్న ఒక అరుదైన ఫోటోను ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ పిక్‌కు విజయ్ క్యాప్షన్ ఇస్తూ, వర్షం కారణంగా షూటింగ్ రద్దయిందని, చిన్ననాటి ఇష్టమైన ప్రదేశంలో మధ్యాహ్నం పూట ఇలా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల తన ఎనర్జీ రీఛార్జ్ అయిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ అందమైన ఫోటోను తన సతీమణి, ప్రముఖ నటి రష్మిక మందన్న తీశారంటూ ఆమెకు ప్రత్యేకంగా క్రెడిట్ ఇవ్వడం విశేషం. ఈ దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్, రష్మిక జోడీ ఆన్ స్క్రీన్‌పై కూడా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ డ్రామా 'రణబాలి' చిత్రంలో ఈ రియల్ లైఫ్ కపుల్ ఆన్ స్క్రీన్‌పై జంటగా నటిస్తున్నారు.



## 90 ఏళ్ల ఘనమైన నట వారసత్వం మాది

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. ఈ సందర్భంగా నాగార్జునతో పాటు అతడి కుమారులు వారి సినీ ప్రయాణం, కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అక్కినేని కుటుంబం నుంచి తొమ్మిది దశాబ్దాల సినిమా చరిత్ర కొనసాగుతుండటం పట్ల టాలీవుడ్ కింగ్ నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. లెగసీ అంటే కేవలం నటులుగా ఉండటం కాదని, మొత్తం సినిమా రంగానికే సేవ చేయడమని ఆయన స్పష్టం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు అడుగుజాడల్లో తాను ప్రయాణించానని, ఇప్పుడు తన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా అదే బాటలో నడుస్తున్నారని తెలిపారు. సృజనాత్మక రంగంలో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో చెబుతూ, షూటింగ్ సెట్స్‌లో ఎవరికోసం ఎప్పుడూ ఇబ్బంది కలిగించకూడదనే తన సిద్ధాంతాన్ని గుర్తుచేసుకున్నారు. 'శివ', 'గీతాంజలి' వంటి సాహసోపేతమైన చిత్రాలతో తాను ఎలా కొత్త మార్గాన్ని ఎంచుకున్నానో, అదే రీతిలో కుమారులు కూడా సొంత గుర్తింపు తెచ్చుకోవాలని నాగార్జున ఆకాంక్షించారు. నాగచైతన్య మాట్లాడుతూ.. దాదాపు 90 ఏళ్ల సినిమా ప్రయాణం కాలాతీతమైనదని, తాత నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చైతూ తెలిపారు. సినిమా పరిశ్రమలోకి వచ్చిన మొదట్లో తనకంటూ ఒక స్టైల్ వెతుక్కునే క్రమంలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నానని, అయితే కాలక్రమేణా సినిమాపై ఉన్న ఇష్టంతో ఆ సవాళ్లను అధిగమించానని చెప్పారు. అక్కినేని కుటుంబం అందించిన లెగసీని కాపాడుకోవడం తమ బాధ్యత అని యంగ్ హీరో అఖిల్ అక్కినేని పేర్కొన్నారు. తమ కుటుంబం నుంచి వచ్చిన వారసత్వాన్ని 'బంగారు బ్యాటన్'తో పోల్చిన



ఆయన, దానిని మరింత ముందుకు తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తాత ఇచ్చిన వారసత్వాన్ని ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటామని అఖిల్ భావోద్వేగంగా పంచుకున్నారు.

## మమితా బైజు.. మరో మూవీతో సిద్ధం

'ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.





## బ్రేకప్ స్టోరీతో వార్తల్లో నిలుస్తున్న అనుపమ..

కోలీవుడ్ దిగ్గజ దర్శకుడు శంకర్ వారసురాలిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఎంట్రీ ఇచ్చిన అదితి శంకర్.. నటనతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకుంది. తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు.. త్వరలో 'వన్స్ మోర్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవతున్నది. విఘ్నేష్ శ్రీకాంత్ దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ డ్రామా ఆగస్టు 28న థియేటర్‌లోకి రానుంది. ఈ సంరద్భంగా తాజాగా ప్రమోషన్స్ పాల్గొన్న అదితి శంకర్.. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఇటీవలే వెల్లడించిన బ్రేకప్, ఎమోషనల్ స్టోరీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇటీవలే నా తోటి నటి అనుపమ ఇచ్చిన ఇంటర్వ్యూ చూశాను. దీనిపై ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉండవచ్చు. కానీ, తన సొంత కథను ధైర్యంగా పంచుకున్నందుకు ఆమెకు హాట్సాఫ్ చెప్పాలి. అందులో నిజాయితీ ఉంది. ఎవరినీ కించపరచాలనేది ఆమె ఉద్దేశం కాదని భావిస్తున్నాను. ఆమె పంచుకున్న అనుభవం చాలామందికి అవగాహన కలిగిస్తుంది. ఎందుకంటే, ఎంతోమంది స్త్రీలు, పురుషులు తమ జీవితాల్లో ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటూ, తమకు ఏం జరుగుతోందో కూడా గ్రహించలేకపోతున్నారు' అని తన అభిప్రాయాన్ని పంచుకుంది.

## మ్యూజికల్ డ్రామా.. జగమే సంగీతం

### అమెజాన్‌లో 4నుంచి వెబ్ సీరిస్

టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ ప్రపంచ వ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. కర్ణాటక సంగీత నేపథ్యంతో రూపొందిన ఈ ఒరిజినల్ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రసారం కానుంది. ప్రముఖ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌ను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ప్రభావ్ ఈ సిరీస్‌కు కథను అందించగా, విశాల్ చంద్రశేఖర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కర్ణాటక సంగీత సంప్రదాయాలను సమకాలీన శ్రుతులతో మేళవిస్తూ ఆయన అందించిన స్వరాలు ఈ కథకు ప్రాణం పోశాయని చెప్పవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో తెలుగుతో పాటు తమిళ డబ్బింగ్ వెర్షన్, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది. ఈ కథ విషయానికొస్తే.. కర్ణాటక సంగీత వారసత్వాన్ని కలిగిన కుటుంబం మరియు దాని మూలాల చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. తన తాత గారి సంగీత వారసత్వాన్ని కొనసాగించాలనుకునే బాలు అనే యువకుడు.. కుటుంబ బంధాలు, రహస్యాలు, సాంప్రదాయ కట్టుబాట్ల మధ్య




ఎలా నలిగిపోయాడనేదే ప్రధానాంశం. తన కుటుంబం నిర్మించిన ప్రతిష్టను కాపాడుకుంటూనే, తనకంటూ ప్రత్యేకమైన కళాత్మక స్వరాన్ని ఎలా కనుగొన్నాడనే భావోద్వేగ ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు. సంగీతంలోని భావోద్వేగ శక్తిని చాటిచెప్పే హృద్యమైన కథే 'జగమే సంగీతం' అని, సంప్రదాయం, ఆశయం వంటి అంశాలను ఇది అద్భుతంగా అన్వేషిస్తుందని తెలిపారు. అలాగే నిర్మాత సుష్మిత కొణిదెల మాట్లాడుతూ.. సంగీతం కేవలం ఒక కళ మాత్రమే కాకుండా, ఆ కుటుంబంలోని ప్రేమ, సంఘర్షణలను తెలిపే భావోద్వేగ భాషగా ఎలా మారుతుందో ఈ సిరీస్ ద్వారా చూపిస్తున్నామని పేర్కొన్నారు. అసాధారణ నటీనటులతో తెరకెక్కిన ఈ సంగీత భరిత ప్రయాణాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆస్వాదిస్తారని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083..EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com